
విడి ప్రతి రూ.15/-

జులై 2011

# స్పందన

ఆధ్యాత్మిక మాస పత్రిక



**ఆయన నిన్ను ప్రేమించి ఆశీర్వదించి**
**అభివృద్ధి చేసి... దీవించును.**

ద్వితీ 7:13

# ప॥గో॥జిల్లా బందపురంలో శాంతి, సువార్త మహాసభలు



సందేశం - డా॥దేవ



రక్షణ తీర్మానం చేసుకుంటున్నప్రజలు



గానం, సందేశం - రెవ.కె.జె.మోజెస్





చినబాబు కుటుంబం కోసం, ప్రజలకోసం ప్రార్థిస్తున్న డా॥దేవ



సహకరించిన స్థానిక దైవజనులు
పా॥సురేష్, పా॥ఫిలిప్‌గార్లు





బందపురం యూత్‌తో డా॥దేవ

**ప్రముఖ సువార్త సంగీత దర్శకులు డా॥ పి.జె.డి.కుమార్ గారి కుమార్తె డా॥శృతి & డా॥ కరుణ్‌ల వివాహం 7-6-11న హైదరాబాదులో జరిగింది. నవదంతులకు "స్పందన" హార్థిక శుభాకాంక్షలు అందిస్తోంది.**





1976 - 2011 35 సంవత్సరాలుగా దేవుని అపార కృపలో

# స్పందన

ఆధ్యాత్మిక మాసపత్రిక

*The largest circulated Telugu Christian monthly since 35 years*

జులై 2011 | సంపుటి 35 | సంచిక 7

వ్యవస్థాపకులు
**ఆచార్య ఆరార్కే మూర్తి**

ప్రచురణకర్త, సంపాదకులు
**డా॥ దేవసహాయం దండల**

గౌరవ సలహాదారులు
**ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి**

సహకారం
**పాస్టర్ పి. సురేశ్ బాబు**

సంపాదక వర్గం
**బ్రదర్ కె. పరమానందం, బ్రదర్ ఎన్. దేవానంద్, బ్రదర్ ఆర్. ఎలూజై, రెవ. కె. జాన్ మోజెస్, శ్రీమతి ఎన్. లిల్లీ భాస్కర్**

సహాయ సంపాదకులు
**బ్రదర్ డి. ఎఫ్రాయిం, బ్రదర్ డేవిడ్**

## ఈ సంచికలో..

| | |
|---|---|
| రాజకుమారులం | 6 |
| భయాన్ని జయించాలంటే.. | 8 |
| దేవుని మందిరములోని... | 10 |
| సేద్యంలోని చాతుర్యం | 12 |
| సజీవ సాక్షులు | 15 |
| యెహోవా యందు భయము.. | 16 |
| బైబిల్ స్టడీ | 18 |
| ప్రకటన గ్రంథం | 20 |

మా అడ్రస్
**స్పందన ఆధ్యాత్మిక మాసపత్రిక**
51-4-12, ఇ.ఎస్.ఐ హాస్పటల్ రోడ్,
గుణదల, విజయవాడ - 520 004,
*E-mail: spandana1976@gmail.com*

సర్కులేషన్, పుస్తకాలు, సిడిల కోసం ఫోన్స్ :
0866- 2456547, మొబైల్: 9490 11 3300

సభలు, ప్రత్యేక విషయాలు, అత్యవసర ప్రార్థనల కోసం
డా॥ దేవ, సెల్. 994 833 5222

### చందా వివరాలు

| | స్వదేశంలో | విదేశాల్లో |
|---|---|---|
| 1 సంవత్సరం | ₹ 150 | $ 20 |
| జీవిత సభ్యత్వం | ₹ 2000 | $ 200 |
| పోషక సభ్యత్వం | ₹ 150 (ప్రతినెల) | $ 20 |

### ప్రత్యేక మనవి

అందరికీ చందా అందుబాటులో ఉండాలని 150 రూ.లుగా ఉంచాము. వాస్తవానికి సుమారు 200 రూ.లు పైగా ఖర్చవుతుంది గనుక 200 రూ.లు పంపగలిగిన వారు, కానుకలు పంపగలిగిన వారు ఈ సేవకోసం ప్రార్థించి, ప్రభువు మిమ్మును ప్రేరేపించినట్లు సహకరించాలని మనవి. ఇప్పటికే ఈ సేవలో ఆర్థికంగా సాయపడుతున్నవారికి మా ప్రత్యేక వందనాలు. మీరు పంపే చెక్కులు, డ్రాఫ్టులు, యం. ఓలు స్పందన **(SPANDANA)** పేరు మీద పంపాలని మనవి. వెంటనే మీకు స్పందన ఆఫీసునుండి ఉత్తరం పంపిస్తాము. దేవుడు మిమ్మును దీవించును గాక!

### స్పందన ఆఫీసుకు రావాలంటే...

విజయవాడలో, గుణదల ఇ.యస్.ఐ హాస్పటల్ రోడ్‌లో ఉన్న పాత పంచాయితి ఆఫీసు సెంటర్‌కు రావాలి. అక్కడ ఉన్న దేవాలయం ప్రక్కనే ప్రగతి నివాస్ అపార్ట్‌మెంట్స్, మొదటి అంతస్థులో రెండో ఇల్లు FF2

**ఆఫీసు సమయం ఉ॥ 10 నుండి సా॥ 6 గం.**


**అకౌంట్ పేరు "స్పందన" (SPANDANA)**

ఆంధ్రాబ్యాంక్, గుణదల (బ్రాంచ్), విజయవాడ
ఆన్‌లైన్ అకౌంట్ నం. 015810100016691
ISFS Code - ANDB0000158

స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా,రామవరప్పాడు (బ్రాంచి), విజయవాడ
ఆన్‌లైన్ అకౌంట్ నం. 31541230212
IFSC Code - SBIN0011100

గమనిక - ఆన్‌లైన్ కానుక పంపిన వెంటనే వివరములు ఫోన్ ద్వారా గాని, SMS ద్వారా గాని మాకు తెలియజేయాలని మనవి

Printed, Published and owned by **DEVA SAHAYAM DANDALA** Printed at **Spandana Offset Printers**, Suryaraopet, VJA-2. Ph:2430148, For Spandana Graphics & Published from # 30-3-13, Durga Agraharam, Vijayawada




## జీవాహారము

అయ్యా! ప్రతినెల మీరు పంపించుచున్న స్పందన మాకు క్రమముగా అందుచున్నది. మీకు మా వందనములు. మా ఆత్మలకు జీవాహారము అందించుచున్నారు. స్తోత్రములు చెల్లించుచున్నాము.

*డి. సరస్వతిభాయి, విశాఖపట్నం.*

## నిగూఢమైన సత్యాలు

అయ్యా! మేము స్పందన మాసపత్రికను ప్రతినెల అందుకొని చదువుతున్నాము. మాకు దేవునిని గూర్చి చాలా నిగూఢమైన సత్యాలు తెలుస్తున్నవి. ఇందులో ప్రచురిస్తున్న వాక్యమర్మములు మాకు ఎంతో వివరంగా దేవునిని తెలుపుతున్నాయి.

*యమ్. రోజాకుమారి, మల్లేశ్వరం.*

## అభివృద్ధి చెందాలని

ప్రభువునందు ప్రియులైన ఎడిటర్ గారికి, స్పందన పత్రిక మాకెంతో మేలుకరముగా ఉంది. స్పందన టి.వి కార్యక్రమములు కూడా మేము చూస్తూ వుంటాము. మా కెంతో ఆశీర్వాదకరంగా ఉన్నాయని తెలియజేస్తున్నాము. మీరు చేస్తున్న ఈ సేవ ద్వారా మంచి మేలులు పొంది దేవుని ఆశీర్వాదాలతో అభివృద్ధి చెందాలని ప్రార్థిస్తున్నాము.

*టి. మరియ, డోర్నకల్.*

## బైబిలు అంతా చదివినట్లు..

ప్రియమైన దైవజనులకు, మీ స్పందన పత్రిక చదివాము. ముఖచిత్రంతో పాటు మెచ్చుకుండా వుండలేము. అంశాలన్నీ ఎంతో ప్రాముఖ్యత, విలువగానే ఉన్నాయి. ప్రచురించిన 10 అంశాలు **"ప్రకటన, కుమ్మరిపాత్ర, హత్తుకొని ఎత్తుకొనును, అర్థవంతంగా కొనసాగిద్దాం, నాగానము..,, మంచి ముత్యం, ముత్యముకంటే.., బైబిల్ పేర్లు, చిన్నారి విశ్వాసము, అవసరమైనది యేసే"** వీటి ద్వారా దేవుని దీవెనాశీర్వాదాలు స్పందన ద్వారా అందించిన మీకు ధన్యవాదాలు.

*పి. నిర్మల, గుంటూరు.*

## స్పందన అలిగిందా?!

ప్రభువునందు ప్రియులు స్పందన ఎడిటర్ గార్కి నా హృదయపూర్వకమైన వందనములు. అయ్యా! నాకు మే నెల స్పందన చేరలేదు, చాలా బాధపడ్డాను. బహుశా ప్రార్థన కూటముల హడావిడిలో మరచిపోయారని అనుకున్నాను. కాని జూన్ నెల స్పందన చూచే సరికి నాకు చాలా ఆశ్చర్యము కలిగింది. గ.ను.క, మెదడుకు మేత చూడగానే నాకు మేనెల కార్యక్రమములు దూరమైనందుకు విచారించాను. ప్రతినెలా క్రమము తప్పకుండా వచ్చే స్పందన పత్రిక, నామీద అలిగినట్లుగా భావించాను. పత్రిక అభివృద్ధికి సంతోషిస్తూ ప్రార్థిస్తున్నాను. స్పందన బృందమువారి నిర్విరామ కృషికి నా హృదయపూర్వకమైన వందనాలు.

*జె. సరోజిని, రాజమండ్రి.*

## అద్భుత సభలు

ప్రభువునందు ప్రియులు డా|| దేవ గారికి, స్పందన టివి కార్యక్రమాల్లో విజయవాడ శాంతి, సువార్త మహోత్సవాలలో మీ ప్రసంగము వీక్షించి ఎంతో ఆనందించాను. యేసయ్య రక్తము అనే అంశము మీద చాలా చక్కని సందేశమిచ్చారు. దేవుని ఆత్మ అభిషేకం మీమీద ఉండటం గమనించాము. అద్భుతంగా జరిగిన సభలను వీక్షించి చాలా సంతోషించాము. దేవుడు మిమ్మును అనేక ప్రాంతాలలో బలంగా, దేవునికి మహిమార్థమై వినియోగించు వాడు కోవాలని ప్రార్థిస్తున్నాము.

*పాస్టర్ పాల్, చిలకలూరిపేట*

## ఆణిముత్యాలు

**జీ**వితంలో గెలవాలి అనే ఉత్కంఠ యువతీ యువకులకు సహజం! అయితే క్రీస్తునందు కీర్తి కండూతికి తావు లేదు. విశ్వసనీయులమై బతికితే, అదే గొప్ప గెలుపు అంటున్నాడు యేసుప్రభువు. మనలో జ్ఞాపకాల లైబ్రరీ ఉంది. తప్పిపోయిన కుమారుడు పందుల కొట్టంలో ఉండి తన వెనకటి జీవితాన్ని జ్ఞాపకం చేసుకున్నాడు. 'తాను తండ్రి వద్ద ఉండగా ఎంత సమృద్ధి! ఇప్పుడు ఆకలితో చచ్చిపోతున్నాను' అంటూ ఏడ్చాడు. గత జ్ఞాపకాలు అపరాధ భావనను పెంచుతాయా? నీలో అభద్రతా భావం గూడు కట్టుకొని ఉందా? ఏం జరుగుతుందో అనే భయం. మనసులో ఏదో దాచుకుందామని, దాన్ని గురించి కంగారు, తత్తరపాటు, మనిషిలో అహంకారం వికృతరూపాలు ధరిస్తుంది. క్రీస్తునందు దాపరికమేమీ లేదు. క్రీస్తునందు మర్మమేమీ లేదు. అంతా అందరికీ కనబడుతుంది. నీవు రహస్యంలో ఎలా ఉన్నావో బహిరంగంగా కూడా అలాగే ఉన్నావు, ప్రజల మెప్పుకోసం వేషాలు వేయటం ఆధ్యాత్మిక రుగ్మత. క్రీస్తునందు ఉన్న నిన్ను క్రీస్తు నింపుతాడు. పరిశుద్ధాత్మ నిన్ను క్రీస్తుతో నింపుతాడు. నా మటుకైతే బతకటమంటే క్రీస్తు. చావు అనే సంఘటన నాకు నష్టంకాదు. లాభమే, ఫిలిప్పీ 1:21. 'క్రీస్తునందు' అనేది సురక్షిత ప్రదేశం. రోమా 8:20 క్రీస్తునందున్న వారికి సమస్తమూ వారి మేలుకే సమకూడి జరుగుతుంది.

బాప్తీస్మమిచ్చే యోహానంతటివాడు యేసును అనుమానించాడు. "నీవేనా మెస్సీయవు? లేదా మేము మరి ఒకనికోసం కనిపెట్టాలా" అని అడిగాడు. యేసు కోసం అభ్యంతరపడనివాడు ధన్యుడు. అర్థం కానప్పుడు ఎక్కువ విశ్వాసం కావాలి. విశ్వాస బలం సందేహాలను జయిస్తుంది. యోహాను 20:27 యేసు తోమాతో అన్నాడు "అనుమానాలు మాని, నమ్మకం కలిగిన వాడవై నిలువు!" తోమా స్పందన "నా ప్రభూ! నా దేవా!" యాకోబు 1:3 విశ్వాసమొక పరీక్ష. గెలిస్తే జీవకిరీటం ప్రాప్తిస్తుంది. పరీక్షల ఉద్దేశం మన గెలుపు. ఓటమి కాదు. పరీక్ష తప్పిన విద్యార్థి 'నేను చదివిన స్కూలు మంచిది కాదు' అని చెప్పటాన్ని హేతుకీకరణం అంటారు. క్రీస్తునందు ఈ మనస్తత్వం మనకు ఉండదు, ఉండకూడదు. నాలో ఉన్నవాడు లోకాధికారి అయిన సైతానుకంటే గొప్పవాడు.

ఇది విశ్వాసి నినాదం

క్రీస్తునందు భవదీయుడు - ఆరార్కె

# మనలో మాట....

మా ప్రియ పాఠకులకులందరికీ,

యేసయ్య దివ్య నామమున నా హృదయ పూర్వక వందనాలతో ఈ నెల శుభాకాంక్షలు తెలియజేస్తున్నాను. **యోహాను 2. 11 – యేసు .... సూచక క్రియను చేసి తన మహిమను బయలు పరచెను. అందు వలన ఆయన శిష్యులు ఆయనయందు విశ్వాసముంచిరి.** ఈ రోజుల్లో అనేక సూచక క్రియలు జరుగుతున్నాయి. ప్రజలు ప్రభువునందు విశ్వాసముంచటం లేదు, సూచక క్రియలు, స్వస్థతలు జరిగించే వారి మీద విశ్వాసముంచుతున్నారా? అనిపిస్తోంది. ఘనత, మహిమ, ప్రభావాలు మన దేవునికే చెందాలి. ఈ వాక్య బాగంలోని రాతి బానలను గురించి మూడు విషయాలు మీ దృష్టికి తెస్తాను.

**<u>1. శుద్ధి చేయబడిన బానలు</u> – వ. 6. *యూదుల శుద్ధీకరణాచారం ప్రకారం...'*** అంటే అవి శుద్ధి చేయబడినవి. మనం కూడా శుద్ధి చేయబడాలి. అప్పుడే ప్రభువు మనల్ను వినియోగించు కుంటాడు. దేవునికి మహిమ వస్తుంది. ఎలా శుద్ధి అవుతాము? ***1 యోహాను 1. 7 యేసు రక్తము మనల్ను పవిత్రీకరిస్తుంది.***

**<u>2. నింపబడిన బానలు</u> – వ.7. *ఆ బానలను నీళ్లతో నింపుడని....*** – మనం దేవుని వాక్యంతో నింపబడాలి. **క్రీస్తు వాక్యము మీలో సమృద్ధిగా నివసింపనీయుడి. కొల.3.16.** అదే ఉద్దేశ్యంతో మరో వాక్యం కూడా ఉపయోగించబడింది. **ఆత్మపూర్ణులైయుండుడి. ఎఫె. 5.18**

**<u>3. ఉపయోగింపబడిన బానలు</u> – వ. 8. *అప్పుడాయన వారితో మీరిప్పుడు 'ముంచి'.....*** కేవలం నింపబడటం మాత్రమే కాదు అవి ఉపయోగించబడాలి. వారు ఆ నీటిని ఉపయోగించటం అంటే దేవుని మాటకు **అక్షరాలా విధేయత** చూపటం. విధేయత ద్వారానే అద్భుతాలు జరుగుతాయి, దేవుని శక్తి విడుదల అవుతుంది. దేవునికి మహిమ కలుగుతుంది.

సరే! రోజులు త్వరగా గడచిపోతున్నాయి కదూ! అప్పుడే ఆరు నెలలు అయిపోయాయి. గడిచిన నెలలన్నిటిలో ఎన్నో సమస్యలనుండి, కష్టాలనుండి, బాధలనుండి ప్రభువు మనలకు కాపాడాడు. స్పందన టివి కార్యక్రమాలు, మాస పత్రికల ద్వారా మీరు స్వీకరిస్తోన్న ఆశీర్వాదాల విషయం తెలియజేస్తూ మీరు రాస్తున్న ఉత్తరాలు, ఫోన్ కాల్స్ కోసం, ఈ సేవా పరచర్యలను ప్రేమించి పోషిస్తూ ఇన్నాళ్లూ మీరిచ్చిన ఆర్థిక సహకారానికి మీకు నా హృదయపూర్వక వందనాలు.

మే నెల 16 నుండి 18 వరకూ ప॥ గో॥ జిల్లా బందపురంలో శాంతి, సువార్త మహాసభలు దేవునికి మహిమకరంగాను, ప్రజలకు ఆశీర్వాదంగా జరిగాయి. స్థానికంగా సోదరుడు ఏదూరు చిన్నబాబు తన కుటుంబం ఈ సభలు నిర్వహించారు. చిన్నబాబు చిన్న షాపు కలిగి ఎలక్ట్రీషియన్‌గా పని చేసుకుంటాడు. తనకు రాబడిలో దేవుని భాగాన్ని తీసి సం॥రానికి ఒక సారి ఈ విధంగా సభలు జరిపి, తన గ్రామమంతా యేసయ్యను తెలుసుకోవాలనే తపన ఆ సోదరునిలో నేను చూశాను. తన భార్యకు ఆరోగ్యసమస్యలున్నా దేవుడు బాగు చేస్తాడని దేవుని సేవకోసం డబ్బు వెచ్చించి దేవుని సేవను జరిగించిన తన విశ్వాసం ఎంతో గొప్పది. స్థానిక విశ్వాసులు, గ్రామ యూత్ ఎంతగానో సహకరించారు. యలమంచిలి నుండి మా సోదరుడు రెవ కె జాన్ మోజెస్ చినబాబుతో కలసి నన్ను ఆహ్వానించారు. చినబాబు దంపతులు నా యెడల చూపిన ప్రేమ అంతాఇంతా కాదు. ఈ సభలకోసం మన పరిచర్యలనుండి ఒక్క రూపాయి ఖర్చు చేయలేదు. సభలు అయిన తరువాత నేను వచ్చేసే ముందు ఈ భార్యాభర్తలిరువురూ ఇంటిలోపలికి నను తీసుకునివెళ్లి వాళ్లు ఎంతో భద్రంగా దాచుకున్న డబ్బు ఓ కవరులో పెట్టి సేవ కోసమని కానుక ఇచ్చారు. కన్నీటితో ప్రభువును స్తుతించాను. వారి ప్రేమకు, ఔదార్యానికి నా ప్రత్యేక వందనాలు.

బందపురంలో వాక్యము ప్రకటించిన తరువాత రక్షణకోసం పిలుపునిచ్చినపుడు కన్నీటితో ప్రభువును ప్రజలు ప్రభువును హృదయమ్లోనికి అంగీకరించిన ఆ దృశ్యాన్ని నేనెన్నడూ మరువలేను.

సభలు జరిగిన తీరుకు అక్కడి యువత ఎంతగానో ప్రభావితమయ్యారు. మరో రెండు గ్రామాల్లో ఇలాంటి సేవను కలిగియుండాలని ఆశిస్తున్నట్టు తెలియజేశారు.

గ్రామాలలో సేవ ఎంతో విస్తారంగా ఉంది. పట్టణాల్లోని సౌకర్యాలన్నీ గ్రామాలకు వ్యాపించినా సువార్త వినటానికి వారు చూపే ఆసక్తి చాలా గొప్పది. స్పందన, సేవియర్స్ హార్ట్‌బీట్ పరిచర్యల్లో దేవుడు నా కిచ్చిన దర్శనం, భారం ఎక్కువగా గ్రామాలను దర్శించాలని. అందుకే మన సేవలో ఎక్కువ భాగం గ్రామాల్లో సేవను జరిగిస్తున్నాము.

అలాగే మే నెల 29, 30 తేదీలలో గుంటూరు జిల్లా భట్టిప్రోలు మండలంలో శాంతి, సువార్త మహాసభలు జరిగాయి. చాలా కాలం క్రితం ఈ వూళ్లో ఓ డాక్టరు గారు సభలు ఏర్పాటు చేసి దైవజనులు ఆరార్కే గారిని నన్ను ఆహ్వానించారు. స్పందన ఆఫీసులో పని ఒత్తిడి మూలకంగా నేను వెళ్లలేకపోయాను. ఆ సభలు ఎంతో బాగా జరిగాయి, ***'నీవు రాలేక పోయావు, కాని ఎప్పుడైనా సరే ఆ వూళ్లో సభలు మనం ఏర్పాటు చేయాలి',*** అని దైవజనులు అన్నారు. ఆమాటలకు ప్రతిఫలమే ఈనాడు జరిగిన ఈ సభలు. కారణం, ఆ నాటి నుండి భట్టిప్రోలులో సభలు నిర్వహించాలని ప్రార్థన చేస్తున్నాను.

ఆ మధ్య కాలంలో తెనాలిలో ప్రియులు సురేంద్రగారి కుమార్తె పంక్షన్‌లో అనేక మంది అన్యుల మధ్య వాక్యాన్ని అందించటానికి నన్ను ఆహ్వానించారు, వాక్యం చెప్పగా అనేకమంది ఆకర్షితులయ్యారు, అలా సోదరులు ప్రభుదాస్ గారు పరిచయమయ్యారు. నన్ను వారి బావగారు సునిల్ గారి కుమార్తె పుట్టినరోజు పంక్షన్‌కు వాక్యం చెప్పటానికి ఆహ్వానించారు. భట్టిప్రోలులో గ్యాస్ కంపెనీ అధినేత సోదరులు సునిల్ గారు. ఆ పుట్టిన రోజు పంక్షన్‌కు పేరెన్నికగన్న రాజకీయ నాయకులు, వ్యాపారవేత్తలు, ఉద్యోగస్తులెందర్నో ఆ పంక్షన్ ఆహ్వానించి వారికి వాక్యం చెప్పించటం నిజంగా దేవునికి మహిమ తెచ్చిన కార్యం. దేవుడు తన దాసుణ్ని ఆత్మతో అభిషేకించి అన్యులు సహితం అర్థంచేసుకునేలా చక్కని వాక్య సందేశాన్ని దేవుడిచ్చాడు.


భట్టిప్రోలులో సువార్త సభలు నిర్వహించాలనే నా మనసులో ఉన్న ఆశను సోదరులు సునిల్ గారికి తెలియ జేశాను. కేవలం వారు నైతిక సహకారమిస్తే చాలు అనుకున్నాను అయితే సోదరులు సునిల్ గారు వారి కుటుంబ సభ్యులు ప్రభుదాస్ గారు, విజయశేఖర్ గారు, సూర్యప్రకాశ్ గార్లంతా చర్చించుకుని, ప్రార్థనా పూర్వకంగా ఈ సభల ఆర్థిక విషయాలన్నీ సోదరులు సునీల్ గారే భరించి చాలా చక్కగా ఈ సభలు నిర్వహించారు. దేవుని సేవకులమని నా యెడల, మా కుటుంబ సభ్యుల యెడల వారు ఎంతో ప్రేమ చూపించారు. దేవునికి స్తోత్రాలు. ఈ కుటుంబాలను, సోదరులు సునీల్ గారి వ్యాపారాలను దేవుడు సమృద్ధిగా దీవించాలని పాఠకులు ప్రార్థించాలని మనవి.

దేవుని ఆత్మ అభిషేకంతో వాక్యాన్ని ప్రకటించి రక్షణ కోసం పిలుపు నిచ్చినపుడు అనేకమంది ముందుకు వేదిక వద్దకు వచ్చి మోకరించి కన్నీటితో ప్రభువును స్వంత రక్షకునిగా అంగీకరించి ఆత్మలో సంతోషాన్ని అనుభవించారు. ఈ ప్రాంతాలకు మరలా, మరలా రావాలని అనేక మంది దేవుని సేవకులు కోరారు. విత్తబడిన వాక్యం దేవుని నామమహిమార్థమై ఫలించేలా ప్రార్థించాలని మనవి. ఈ సభలలో సోదరులు స్టీవెన్సన్ గారు, పీటర్‌సన్ గారు గాన పరిచర్య చేశారు.

ముఖ్య గ్రామాల్లో మండల స్థాయిలో, ఆయా ప్రాంతాలలో ఉండే మా ప్రియ పాఠకులు మీ ప్రాంతంలో కూడా రక్షణ సువార్తను వినిపించే సేవను మీరూ కలిగియుండాలని కోరుతున్నాను. ప్రభువు చిత్త ప్రకారం మీ గ్రామాలను దర్శించాలని, మిమ్మును వ్యక్తిగతంగా కలిసి మీ కోసం ప్రభువు కృపాసనం వద్ద విజ్ఞాపన చేయాలని ఎంతగానో ఆశిస్తున్నాము, ప్రార్థిస్తున్నాను. మరిన్ని వివరాలు కావాలంటే నా వ్యక్తిగత సెల్ నంబరు. **994 833 5222** కు ఏ సమయంలోనైనా మీరు ఫోన్ చేయవచ్చు!

ప్రభువునందు ప్రియ పాఠకులారా, దేవుని సేవలో ఇంతవరకూ మేమేదైనా సాధించ గలిగాము అంటే ఈ పరిచర్యల్లో నమ్మకంగా మా కోసం ప్రార్థించి, ఆర్థికంగా, నైతికంగా ఎందరో దేవుని బిడ్డలు ఇచ్చే

*(మిగతా 14వ పేజీలో)*



ఆచార్య ఆరార్కె

# రాజ కుమారులం

ఇది కృపాయుగం, సంఘ యుగం, పరిశుద్ధాత్మ యుగం. ఇందులో విశ్వాసులందరూ రాజులైన యాజక సమూహం! అందరూ అదృశ్య వీరులు. నాయకులు. పరిశుద్ధాత్మ ప్రతి విశ్వాసిలో యేసు చైతన్యాన్ని వృద్ధి చేస్తాడు. **ప్రకటన 1.6. మనలను ప్రేమిస్తూ తన రక్తము వలన మన పాపముల నుండి మనల్ని విడిపించిన వానికి మహిమ, ప్రభావము. ఆయన మనల్ని తన తండ్రి అయిన దేవునికి ఒక రాజ్యముగా, యాజకులుగా చేశాడు.** రేపు మనం యేసుతో కలిసి ఈ లోకమంతటిని పరిపాలిస్తాము. మనకు మహోజ్వలమైన భవిష్యత్తు ఉంది.

## అధికారం

ప్రకటన 5.10 దృశ్యం చూడండి. యేసు సిలువ వేయబడి, తన రక్తమిచ్చి ప్రతి వంశములో ఆయా భాషలు మాట్లాడే వారిలో ప్రతి ప్రజలో ప్రతి జనములో దేవుని కోసమై మనుష్యులను కొని వారిని దేవునికి రాజ్యముగా, యాజకులుగా చేశాడు. వారు భూలోకమందు ఏలుతారు. కొత్తపాట పాడతారు. జాతుల మీద కూడా వారికి అధికారమిస్తాడు. ఆధిపత్యమూ, అధికారము, శక్తి, ప్రభుత్వమూ అంతా ఆయనదే! ఈ యుగంలోనే కాదు రోబోయే యుగంలో కూడా మహోన్నత నామము పొందిన వాడు యేసు మహారాజు.

## మహిమైశ్వర్యం

పరలోకానికి ఆయన ఆరోహణమై, ఎంతో మహోన్నత, మహిమోన్నత పదవిని అలకరించి ఉన్నాడు. తండ్రి కుడిపార్శ్వమున కూర్చొని ఉన్న ప్రభువును చూస్తున్నాము. యేసుతో పాటు మనల్ని మృతి నుండి లేపి దేవుడు మనల్ని క్రీస్తుతో పాటు తనతో సింహాసం మీద కూర్చోబెట్టుకున్నాడు. మన ఆరోహణం ఎంతో ఆశ్చర్యం! మనోనేత్రాలు తెరిచి ఇప్పుడే చూడగలగాలి. విశ్వాసి నిత్య భవిష్యత్తు ఎంత గొప్పది! ఆశ్చర్యం! ఆయన నిన్ను నన్ను పిలచాడు. ఎంత ఉన్నతమైన పిలుపు! మనకు ప్రాప్తించిన మహిమైశ్వర్య స్వాస్థ్యం ఎంతో గొప్పది.!

## అలంకరణ

కొత్త భూమి, కొత్త ఆకాశం దేవుడు సృషించి మనకిస్తాడు. అవి లయం కావు. నూతన యెరుషలేము. ఆమె పెండ్లి కుమార్తె. తన భర్త కోసం అలంకృతమై తన భర్త కోసం దిగి వస్తుంది. మనలో ప్రతి ఒక్కరికి ఒక కొత్త పేరు వస్తుంది. మనం దేవునికి ఒక కొత్త పాట పాడుతాము. నూతనంగా జన్మించిన వారి పేర్లు పరలోకంలో,



జీవగ్రంథంలో రాయబడి ఉన్నాయి. దేవుడు మనలో చేసుకున్న కొత్త నిబంధన ఇది యేసుక్రీస్తుతో సారూప్య స్థితి పొందుతాము. సైతానును మన ద్వారా పాదాల కింద చితగ్గొట్టిస్తాడు దేవుడు. ఈ నిబంధన యేసుక్రీస్తు రక్తంతో సంతకం చేయబడింది. రక్తప్రోక్షణ నిబంధన. మనమంతా కొత్త నిబంధన యాజకులం.

**పునాదులు గల పట్టణం**

పైనున్న యెరూషలేము పునాదులు గల పట్టణం. దాని నిర్మాత, శిల్పి దేవుడే. అది స్వతంత్రమైనది. అది మనకు తల్లిలాంటిది. మనం నిత్యత్వంలో ఉండబోయే పట్టణం అదే. దాని కోసం ఎదురుచూస్తున్నాము. పరమదేవుడు మన దేవుడు నాదేవుడు మహా దేవుడు పరాక్రమవంతుడు. ఆయనకు నీతి విషయంలో న్యాయం విషయంలో మొహమాట మంటూ లేదు. ఆయనలాంటి దేవుడు మరొకరు లేరు. ఆయన తప్ప దేవుడు మరొకరు లేడు. పౌలు మాటల్లో చెప్పాలంటే ఆయన మహా దేవుడు. యేసు మహా మహిమను చూడనొల్లని వారు ఆయనను ఆరాధించలేరు. ఆరాధించినా అది యాంత్రికమై రిఫ్రీజిరేటరోపెట్టిన చల్లటి సరుకై పోతుంది దేవుని ఎదుట అతిశయించ టానికి మానవుడు ఏ పాటి వాడు?

యోహాను 1.11,12. ఆయన తన స్వకీయుల దగ్గరకే వచ్చాడు. ఆయన స్వకీయులే ఆయనను అంగీకరించలేదు. తనను ఎందరు అంగీకరించారో వారికందరికి అనగా తన నామమందు విశ్వాసముంచిన వారికి దేవుని పిల్లలు అవడానికి ఆయన అధికారం అనుగ్రహించారు. మన రక్షణకు మరే కారణము లేదు. దేవుని సౌజన్యము దేవుని కృప, దేవుని కనికరం మనలను నరకంలో పడనీయదు. దేవుని కృప మనలను పరలోకంలో చేర్చుకుంటుంది. ఎఫెసీ 2.8,9. మీరు విశ్వాసం ద్వారా కృప చేతనే రక్షించబడియున్నారు. ఇది మీ వలన కలిగినదికాదు. ఇందులో మనిషి అతిశయపడటానికి ఏమీ లేదు.

**జీవ నది – జీవ వృక్షం**

ప్రకటన 22. 1–5 లో నూతన భూమి, నూతన ఆకాశం పేర్కొనబడటం విశేషం. జీవజల నది పారుతోంది. నదికి ఇరువైపుల జీవవృక్షం! ప్రతినెలా అది ఫలిస్తూనే ఉంటుంది. ఆ వృక్షపు ఆకులు సైతం జాతులను స్వస్థపరుస్తాయి. అక్కడ శాపగ్రస్తమైన సరుకేదీ ఉండదు. ఆ పట్టణంలో దేవుని సింహాసనం ఉంది. దేవుని సేవకులు పరివేష్టించి ఉంటారు. అక్కడ రాత్రి అనేదే ఉండదు. దేవుడే వారికి అఖండ జ్యోతి. ఎడతెగని వెలుగు వెలుతురు. వారు నిత్యమూ పరిపాలిస్తారు. యేసుక్రీస్తు వచ్చేస్తాడు.

**ప్రతి స్పందన**


"ఇదిగో నేను త్వరగా వస్తున్నాను అని ప్రభువు అనగానే దానికి సత్వర ప్రతిస్పందన ప్రభువైన యేసూరా!", యేసు వస్తున్నాడు అని ఈ క్షణంలో ప్రకటన వినబడిందనుకో నీ ప్రతి స్పందన ఎలా ఉంటుంది చెప్పగలవా? దాని మీదనే నీ నిత్య భవిత ఆధారపడి ఉంది. మహిమ, జ్ఞానము, కృతజ్ఞతాస్తుతి, ఘనత, శక్తి, బలము కలుగును గాక! అని చెబుతూ దేవునికి నమస్కారం చేశారు. ఆమెన్! దేవుని వాక్యం వినటం, చదవటం, ధ్యానించటం అంటే దేవుడు నీ జీవితంలో ప్రవేశించి తన చిత్తానికి సంకల్పానికి లోబరచటానికి ఎంతో చేశాడనీ నీవు ఆయన మనస్సుతో ఏకీభవించావనీ అర్థం.

ఆయనకై సిద్ధపడి, ఎదురుచూద్దాం, ఆయన సిద్దపరచిన ఆ పరలోక పట్టణంలో ఆయనతో ఆనందిద్దాం. దైవాశీస్సులు.

**సర్క్యులేషన్ – మీ సహకారం**

స్పందన పత్రిక మీకు నచ్చిందా? ఇతరులకు పరిచయం చేయండి. స్పందన పత్రికను మీ బంధువులకు, స్నేహితులకు, ఇరుగుపొరుగు వారికి పరిచయం చేయండి. పుట్టిన రోజుకో, పెళ్లి రోజుకో లోక సంబంధమైన బహుమతులు ఇచ్చేకంటే వారికి స్పందన పత్రిక బహుమతిగా ఇవ్వండి. మీ చందా అందగానే మీ తరుపున వారికి మంచి గ్రీటింగ్ కార్డు ఒకటి పంపుతూ ప్రతి నెలా స్పందన పంపిస్తాము. ఆలస్యమెందుకు? వెంటనే వారి అడ్రసులు మాకు పంపండి

– ఎడిటర్



- డా॥ దేవ దండల

# భయాన్ని జయించాలంటే...

**"ఏది వస్తుందని నేను బహుగా భయపడ్డానో అదే నాకు సంభవిస్తుంది"**
**-యోబు 3:25**

**మా**నవ జీవితంలో భయం ఒక భాగం. భయాన్ని జయించడానికి మనము ఏం చేయాలో? బైబిలు ఏం చెబుతుందో చూద్దాం! ఈ సందర్భంలో యేసయ్య మిత్రుడైన లాజరు మరణం మనకు సహాయపడుతుంది. యోహాను 11:21-36 **"ప్రభువు మన కోసం చింతిస్తున్నాడ"** ని ఈ గొప్ప సందర్భాన్ని బట్టి అర్థం చేసుకోగలం. మరి కొంతమంది రాబోయే మరణం గూర్చి భయపడుతుంటారు. కొందరు తమ ఆరోగ్య విషయంలో భయపడుతుంటారు. పౌలు కూడా అనారోగ్య భయంతో జీవించాడు, శరీరంలో ముల్లు ఒకటి వుండేది. (2 కొరింథీ 12:7-10) మరి కొంతమంది తమ ఆస్థిని కోల్పోతామేమో అనే భయంతో వుంటారు. **"ఒకని కలిమి విస్తరించుట వలన అతని జీవమునకు మూలము కాదని"** యేసయ్య చెప్పారు. (లూకా 12:15) కొందరికి వారు చేసిన తప్పుకి దొరికిపోతామనే భయం. దేవుడు నిషేదించిన ఫలములను తినిన తరువాత ఆదాము హవ్వలు ఏదేను వనములో దాక్కొన్నారు. 'దేవునికి కనబడం' అని వారనుకొని వుండవచ్చును. (ఆది 3:8-9) అయితే సత్యమేమిటంటే మానవులకు కనబడకపోయినా దేవునికి సమస్తము ఎరుకే.

## భయాన్ని జయించే విధానం

యేసయ్య చెప్పిన మాట **"నా స్నేహితులైన మీతో నేను చెప్పునదేమనగా - దేహమును చంపిన తరువాత మరేమియు చేయనేరని వారికి భయపడకుడి. ఎవనికి మీరు భయపడవలెనో మీకు తెలియజేయుదును. చంపిన తరువాత నరకములో పడద్రోయ శక్తి గలవానికి భయపడుడి. ఆయనకే భయపడుడని మీతో చెప్పుచున్నాను."** (లూకా 12:2-5) మరణం కంటే ఘోరమైనది ఒకటుందని యేసయ్య చెప్తున్నారు. మరణాన్ని జయించిన వానికి మనం భయపడాలి. ప్రసంగి 12:13 ప్రకారం దేవునికి, ఆయన ఆజ్ఞలకు లోబడాలి. ప్రతి క్రైస్తవుడు హెబ్రీ 13:6 ప్రకారం **"ప్రభువు నాకు సహాయుడు, నేను భయపడను, నరమాత్రుడు నాకేమి చేయగలడు"** అని ధైర్యంతో చెప్పగలగాలి. మనం భయాన్ని జయించాలంటే దేవుని ప్రేమను అంగీకరించడం నేర్చుకోవాలి. ఈ లోకంలో అన్నిటికంటే విలువైన ఆత్మ మనకుంది. మత్తయి 16:26

**"అయితే దేవుడు మన యెడల తన ప్రేమను వెల్లడిపరస్తున్నాడు. ఎట్లనగా మనమింకను పాపులమై యుండగానే క్రీస్తు మనకొరకు చనిపోయెను."** (రోమా 5:8) మన తల్లిదండ్రులు మనల్ని ప్రేమిస్తున్నప్పుడు వారి ప్రేమను మనం ఎలా అంగీకరిస్తామో దైవప్రేమ విషయంలో కూడా ఇది సత్యం. మనం స్వాభావికంగా పాపులం. దేవుణ్ని ఎన్నోసార్లు



దుఃఖపర్చాము. అయినా దేవుడు మనలను యింకా ప్రేమిస్తున్నాడు. ఎందుకంటే **"ప్రేమలో భయముండదు"** అంతే కాదు **'పరిపూర్ణ ప్రేమ భయమును వెళ్ళగొట్టును.'** (1 యోహాను 4:18) దైవప్రేమను సంపూర్ణంగా అంగీకరిస్తే సమస్త భయం మాయమవుతుంది.

భయాన్ని జయించాలంటే దేవుని యందు నమ్మకముంచాలి. సామెతలు 3:5-6 **"నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణ హృదయముతో యెహోవాయందు నమ్మకముంచుము. నీ ప్రవర్తన అంతటియందు ఆయన అధికారమునకు ఒప్పుకొనుము. అప్పుడు ఆయన నీ త్రోవలు సరాళము చేయును."** భయాన్ని పారద్రోలాలంటే ఈ గొప్ప ముందడగు మనం తప్పక వేయాలి. దేవుణ్ని నమ్మాలి. ఆయనకు లోబడాలి. ఈ రెండూ ప్రాముఖ్యమైనవి. దేవుడు మనకు పిరికి ఆత్మను యివ్వలేదు. (2 తిమోతి 1:7). ధైర్యశాలులు నమ్మకమైన క్రైస్తవులు.

**గాడాంధకారపు లోయలో నేను సంచరించినా ఏ అపాయమునకును భయపడను, నీ దుడ్డుకర్ర, నీ దండము నన్ను ఆదరించును.** (కీర్తనలు 23:4)

గెన్నెసరెతు సరోవరంలో పయనిస్తున్న ఒక పడవ గాలివానలో చిక్కుకుంది. నావ మునిగిపోవడానికి సిద్ధంగా వుంది. ఆ దినమంతా వాక్యపరిచర్య చేసినందువల్ల యేసయ్య దోనెలో ఓ మూల నిశ్చింతగా నిద్రబోతున్నాడు. అయితే ఆయనతో వున్న శిష్యులు మునిగి చనిపోతామేమోనన్న భయంతో **"అయ్యా! మేము నశించిపోతున్నాం"** అని పెద్దగా ఆర్తనాదాలు చేశారు. యేసయ్య నెమ్మదిగా లేచి **"మీరెందుకు భయపడుతున్నారు? మీ విశ్వాసం ఏమైంది?"** అని వారిని మందలించి, గాలిని నిమ్మళింప చేశాడు.

## భయాలకు కారణాలు

### 1) అవిధేయత

ఆదాము హవ్వలు దేవుని ఆజ్ఞ మీరనంత వరకు ఎంతో సంతోషంగా, నిర్భయంగా జీవిస్తూ వచ్చారు. ఎప్పుడైతే సైతాను ప్రభావానికి లోనై, పాపానికి గురయ్యారో అప్పుడే వాళ్ళలో **"భయం"** ప్రారంభమయ్యింది. ఆది 3:10

### 2) అవినీతి

కష్టపడకుండా, అన్యాయంగా డబ్బు సంపాదిస్తుంటే మనిషి మనసులో భయం చోటు చేసుకుంటుంది, క్రుంగదీస్తుంది. భయం వున్నంత వరకూ మనశ్శాంతి ఉండనే ఉండదు.

### 3) అబద్ధాలు

యాకోబు అబద్ధమాడి మోసంతో తండ్రి ఆశీర్వాదం పొందినందుకు అతనిలో భయాందోళనలు మొదలైనాయి. అతని ఆత్మలో సంఘర్షణ మొదలై ఆ సమస్య పరిష్కారమయ్యేంత వరకూ లోలోపల పెనుగులాట ప్రవర్తిల్లుతూనే వుంది. తన అన్న ఏశావు చంపుతాడనే భయంతో వుండేవాడు.

### 4) అనుమానం

సౌలు పౌలుగా మారిన తరువాత యేసయ్య శిష్యుల్ను కలుసుకోడానికి ప్రయత్నిస్తే వారు అతడు శిష్యుడని నమ్మక అందరూ అతనికి భయపడ్డారు అ.కార్య 9:26

### 5) అజ్ఞానం

మూఢనమ్మకాలకు మూలం అజ్ఞానమే! శకునాలు, విధవరాలు ఎదురైతే అశుభం, వివాహకార్యాలకు మంచిరోజు... ఇలాంటి మూఢ విశ్వాసాలతో మనిషి భయపడుతూ వుంటాడు.

### 6) తల్లిదండ్రులనుండి పిల్లలకు

కొందరు తల్లిదండ్రులు పిల్లల్లో అనవసర భయాలు కల్పించి పిరికివారుగా తయారు చేస్తుంటారు. కొంతమందిలో చిన్నతనంలో ఏర్పడిన భయాలు పెద్దయిన తర్వాత కూడా వారిని వెంటాడుతూనే వుంటాయి.

## భయం వల్ల అనర్థాలు

1. మన ఆలోచనలు మన క్రియల్ను ప్రతిబింబింపజేస్తాయి. భయమనేది వ్యతిరేక భావన (Negetive Emotion) భయం మనలోని సృజనాత్మక శక్తిని లోపింపజేసి, అసమర్థులుగా చేస్తుంది. ఓటమి పాలు చేస్తుంది.

**2. చచ్చుబడిపోవడం:** "అతనికి (ప్రభువు దూతకు) భయపడటం వల్ల కావలివారు వణికి చచ్చిన వారివలె అయ్యారు. మత్తయి 28:4

**3. చెదరిపోవడం:** ఫిలిష్తీయులు ఇశ్రాయేలీయులతో యుద్ధం చేయడానికి గొప్ప సైన్యంతో వచ్చినప్పుడు ఇశ్రాయేలీయులు దిగులు పడుతూ తాము ఇరుకులో ఉన్నట్లు తెలిసికొని భయంతో గుహల్లో, పొదల్లో, మెట్టల్లో దాక్కున్నారు. 1 సమూ 13:5-8

**4. పనులు అసంపూర్ణం:** అనవసర భయం వల్ల అనుకున్న కార్యాలకు భంగం వాటిల్లి అసంపూర్ణంగా నిలిచిపోతాయి. భయంతో చేసే పనుల వల్ల ఎక్కు తప్పులు దొర్లుతాయి.

*(మిగతా 27వ పేజీలో)*



బ్రదర్.ఏసన్న

# దేవుని మందిరములోని ఆనందము


దేవుడు తన ప్రజలను ఆయన మందిరమునకు తోడుకొని వచ్చి ఆనందింపజేస్తానని ప్రవక్తయైన యెషయా ద్వారా సెలవిస్తున్నాడు. నా ప్రార్థనా **మందిరములో వారిని ఆనందింపజేసెదను. నా బలిపీఠము మీద వారర్పించు దహనబలులును. బలులును నాకు అంగీకారములగును. నా మందిరము సమస్త జనులకు ప్రార్థనా మందిరమనబడును (యెషయా 56:7).**

ఆనందం అనేది దైవసంబంధమైన అనుభూతి. అది శాశ్వతమైనది. కొందరు సినిమాలు చూచి, మరికొందరు షికార్లు చేసి ఆనందించాలని కోరుకుంటారు. ఆ విధంగా పొందే సంతోషం క్షణకాలం మాత్రమే నిలుస్తుంది. దేవుడు తన ప్రజలను ఆయన మందిరములోని ఆనందాన్ని అనుభవించునట్లు చేస్తానంటున్నాడు. ఇదే వాక్యాన్ని యేసుప్రభువు తన సేవ ముగింపులో యెరూషలేము దేవాలయములో ప్రవేశించినప్పుడు **"నా మందిరము ప్రార్థనా మందిరము"** అని వ్రాయబడియున్నది. **"అయితే మీరు దానిని దొంగల గుహగా చేస్తున్నారు"** అన్నాడు (లూకా 19:45-46).

ఒకసారి యోసేపు మరియమ్మలు పస్కాపండుగ ఆచరించుటకు యేసయ్యను తీసికొని యెరూషలేముకు వెళ్ళారు. మన యేసయ్య పాపములేని గొర్రెపిల్ల (పస్కా గొర్రెపిల్ల)కు సాదృశ్యముగా ఉన్నాడు. యేసయ్యను నమ్మిన మనం ఆయన గుణగణాలను జీర్ణించుకోవడమే మన పస్కా పండుగ, పస్కా పండుగ ముగించబడి తిరిగివెళ్ళే సమయములో మరియ, యోసేపు ఇద్దరు యేసయ్య తమలో ఎవరో ఒకరి దగ్గర ఉండి ఉంటాడని అనుకున్నారు. ఒక దిన ప్రయాణము సాగిపోయిన తరువాత యేసయ్య తమతో లేడని తల్లిదండ్రులు గుర్తించి, ఆయనను వెదకటం ప్రారంభించారు. వారి బంధువుల మధ్యలో, నెళవైన వారి మధ్యలో వెదకుతున్నారేగాని ఆయన ఎక్కడ ఉంటాడో గ్రహించలేకపోయారు. అయితే మూడవరోజున వారు యెరూషలేము దేవాలయములోనికి రాగా **ఆయన బోధకుల మధ్య కూర్చుండి, వారి మాటలను ఆలకించుచు వారిని ప్రశ్నలడుగుచు ఉండటం చూచారు. (లూకా 2:46).**

ఈ రోజుల్లో చాలామంది యేసయ్యను వెతకుతారు, కొందరు క్లబ్బుల్లోను మరికొందరు బార్ షాపుల్లోను ఇంకొందరైతే కొండలమీద, గుట్టలమీద వెదకుతూ, తిరుగుతూ ఉంటారు. అలాంటివారు యేసయ్యను పొరపాటున కూడా కనుగొనలేరు. ఆయనను నీవు హృదయపూర్వకముగా వెదకితే ఆయన ప్రార్థనా మందిరములోనే దొరుకుతాడు. యేసయ్య తల్లిదండ్రులు చివరకు దేవాలయములో ఆయనను కనుగొన్నారు.

12 సంవత్సరాల వయస్సులో తన తోటి పిల్లలతో ఆటపాటలలో మునిగి



తేలాల్సిన బాలుడైన యేసు ఎక్కడ కూర్చున్నాడు?

**- దేవుని మందిరములో**

**- దైవజనుల మధ్యలో**

**- ధర్మ సందేహాలు అడుగుతూ వారికి జవాబిస్తూ ఉన్నాడు.**

దేవాలయములో ఉన్న యేసును చూచి **అతని తల్లిదండ్రులు మిక్కిలి ఆశ్చర్యపడ్డారు (లూకా 2:46).** మరి మీరు ఎవరి మధ్యలో ఉంటున్నారు? దుర్భాషలాడుచూ ఇచ్చకపు మాటలు, సరసోక్తులు పలికేవారి మధ్యలో ఉంటున్నారా? లేక దేవుని ప్రజల మధ్యలోనా? మీనోటి మాటలు ఎలా ఉన్నాయి? మిమ్మును గూర్చి తెలుసుకొని మీ నోటి మాటలు విన్న ప్రజలు ఆశ్చర్యపడుతున్నారా? లేదా? నిన్నుబట్టి దేవుని నామము దూషణ పాలవుతున్నదా? యేసుకు బాల్యమునుండే దేవుని మందిరములో, దైవజనుల మధ్యలో కూర్చోవడం అలవాటు.

బాల్యమునుండే యేసయ్య **తండ్రిచిత్తము** నెరవేర్చాలనే దృక్పథం కలిగినవాడు గనుక "మమ్మును ఎందుకు యిలా చేసావు? నీ తండ్రి, నేను దుఃఖపడుతూ నిన్ను వెదుకుతున్నాము" అని ఆయన తల్లి ఆయనతో చెప్పగానే **యేసు - మీరెందుకు నన్న వెదుకు తున్నారు. నేను నా తండ్రి పనులమీద నుండవలెనని మీరెరుగరా**? అని వారితో చెప్పాడు (లూకా 2:49). యేసయ్య తండ్రి తనకప్పగించిన పని చేసి ముగించాలని కోరుకున్నాడు. మరి ఆయనద్వారా రక్షింపబడిన మీరు ఏ పనులమీద ఉన్నారు? కొందరైతే ఆదివారము కూడా దేవుని మందిరానికి వెళ్ళరు. ఆయనను ఆరాధించవలసిన సమయములో పెళ్ళిసంబంధాలు చూచుకోవడం చేస్తుంటారు. వారికి లోకసంబంధమైన కార్యక్రమాలు, దేవుణ్ని ఆరాధించడంకంటే ప్రాముఖ్యం. దేవుని మందిరాన్ని గుర్తించి, పరిశుద్ధులుగా సహవాసము కలిగియున్నప్పుడు నిన్ను చూచిన ప్రతిఒక్కరు ఆశ్చర్యపోతారు. నీ జీవితం అనేకులకు ఆదర్శంగా మారుతుంది. నిరంతరము ప్రార్థనా ధూపం వేసే సమర్పించబడిన దైవసేవకు లున్న మందిరములో నీవు నాటబడాలి గాని రాజకీయాలలో మునిగి ఉన్న నామ కార్థపు ప్రజల మధ్య నాటబడకూడదు.

### మందిరమును శుద్ధీకరించుట

యేసుప్రభువు యెరూషలేములో ప్రవేశించినప్పుడు ఆయనను వెంబడించిన జనసమూహములోని ప్రజలు **"దావీదు కుమారునికి జయము. ప్రభువు పేరట వచ్చువాడు స్తుతింప బడునుగాక! సర్వోన్నతమైన స్థలములలో జయము"** అని కేకలు వేయుచుండిరి. "హోసన్నా! హోసన్నా!!" అంటూ బిగ్గరగా కేకలు వేయుచూ ప్రజలు వెంటరాగా, యెరూషలేములో ప్రవేశించిన యేసయ్యను చూచినప్పుడు పట్టణమంతా **- ఈయన ఎవరో? అని కలవరపడెను (మత్తయి 21:9-10).**

నిత్యము స్తుతి ఆరాధనలతో దేవుని మహిమపరచవలసిన మందిరములో కొందరు రూకలు మారుస్తున్నారు, మరికొందరు గువ్వలు అమ్ముతున్నారు. అది వ్యాపారపుటిల్లుగా ఉందేగాని ఆలయముగా లేదు. మందిరపు పరిస్థితిని చూచిన యేసయ్య ఎంతగానో బాధపడ్డాడు. అప్పుడు **ఆయన రూకలు మార్చువారి బల్లలను గువ్వలమ్మువారి పీఠలను పడద్రోసి "నా మందిరము ప్రార్థనా మందిరమనబడును" అయితే "మీరు దానిని దొంగల గుహగా చేసితిరని చెప్పి వారిని వెళ్ళగొట్టెను" (మత్తయి 21:12-13).** మందిరములో ప్రవేశించిన యేసయ్య మందిరాన్ని శుద్ధీకరించడం ప్రారంభించాడు. మందిరములో రూకలు మారుస్తున్నారంటే అది పూర్తిగా కమీషన్ వ్యాపారస్థులతో చీటిపాటగాళ్ళతో నిండిపోయిందని అర్థం. ఈ రోజుల్లో చర్చీల్లో వేలంపాటలు, చీటిపాటలు, కొట్లాటలు, కోర్టుల చుట్టూ తిరగడం సర్వసాధారణమైపోయింది. విదేశాల నుండి వచ్చే డబ్బు మార్చుకోవడమే కొందరికి వృత్తిగా మారింది. పాపక్షమాపణ పొంది, యేసురక్తములో కడుగబడి, పరిశుద్ధులుగా తీర్చబడిన దేవుని బిడ్డల భక్తిని తూకంవేసే పరిస్థితులు చర్చీల్లో కనబడుతున్నాయి. ఈర్ష, అసూయ, ద్వేషాలు ఉండే స్థలములో ఆత్మసంబంధమైన ఆనందాన్ని ప్రజలు అనుభవించలేరు. కానుక హృదయ పూర్వకమైనదై ఉండాలే గాని సేవకుణ్ని బట్టి, ప్రసంగాన్నిబట్టి కానుక ఇవ్వడంకంటే సిగ్గుపడాల్సింది మరేముంది! ఇలాంటి వారందరు దేవుని సేవను, ఆయన మందిరాన్ని మార్కెట్టుగా మారుస్తున్నారని గుర్తించాలి. అందుకే యేసయ్య - 'నా తండ్రి ఇంటిని మీరు అపవిత్ర పరుస్తున్నారంటూ వ్యాపారస్తులను వెళ్ళ గొట్టి, దానిని శుద్ధిచేసాడు'. మందిరము శుద్ధీకరించబడకపోతే అక్కడ ఆరాధించు వారు ఆనందించలేరు. నా ప్రజలను నా మందిరానికి తోడుకొని వచ్చి ఆనందింప జేస్తాననే వాగ్దానము నెరవేర్చబడాలంటే మొదట మందిరము శుద్ధిచేయబడాలి. మందిరము ఎప్పుడైతే శుద్ధిచేయబడిందో, ఆయనతో వచ్చిన ప్రజల ఆనందానికి అవధులు లేకుండాపోయాయి. మీ ఆనందము పరిపూర్ణమగును గాక! ఆమేన్!



ఆర్.ఎలూజై

# సేద్యం లోని చాతుర్యం

ఆ మధ్యన సువార్త పరిచర్యకు బృందంగా బయలుదేరిన మిత్రులందరం గ్రామ గ్రామాల్లో యేసును ప్రకటిస్తూ పచ్చని పొలాల గట్టునే ఉన్న పల్లె బాటల్లో నడుస్తూ ముందుకు పోతుంటే, ఉన్నట్లుండి 'పెళ పెళ పెళ పెళ' మంటూ పెద్దగా వెలువడిన శబ్దమొకటి అందర్నీ అదరగొట్టి పడేసింది. ఏం జరిగిందా అని పరికించి చూస్తుంటే, పచ్చని పొలాల మధ్యన గుంపులు గుంపులుగా కూర్చునివున్న జనులు రేకు తప్పెట్లతో భీకరమైన శబ్దాలు చేస్తూ, పక్షులను ఊదరగొట్టేయడం కనిపించింది. గగనంలో గుంపులు గుంపులుగా గిరికీలు కొడుతున్న పక్షులు, రివ్వున క్రిందకు దిగిరావడం, అవి వస్తుండగానే అక్కడున్న జనులు రేకు తప్పెట్లను పెళ పెళ మ్రోగించడం, ఆ కర్ణ కఠోరమైన శబ్దాలకు పక్షులు బెంబేలెత్తి పైకి పారిపోవడం, మరలా అవి క్రిందకు దిగిరావడం, జనులు డబ్బాలను డబడబలాడించడం, అంతా ఒక అంతూ పొంతూ లేని ధారావాహిక ప్రసారంలాగా కొనసాగుతుండడంతో చూస్తున్న మాకు ఆసక్తి అధికమయ్యింది.

### ఎందుకలా

ఎందుకలా చేస్తున్నారని ప్రశ్నిస్తే, పైరు చేతికందివచ్చే సమయానికి కంకులకు ఉండే ధాన్యాన్ని తన్నుకుపోవడానికి పక్షులు గుంపులు గుంపులుగా వస్తాయనీ, తెల్లవారింది మొదలుకొని పొద్దుపోయేంత వరకూ పగలంతా అప్రమత్తంగా ఉంటూ పక్షులు కంకుల దరికి రాకుండా చేయాలనీ, అలాగైతేనే కోతకు వచ్చేసరికి ఫలసాయం చేతికందుతుందనీ, ఏ మాత్రం ఏమరుపాటుగా వున్నా పంట పండించేందుకు పడిన కష్టమంతా ఆకాశ అర్పణమయిపోతుందనీ, సుదీర్ఘమైన సబ్జెక్టును ఓపిగ్గా వివరించాడో రైతన్న.

### యేసు చెప్పిన ఉపమానం

ఇదంతా వింటుంటే... (మత్త 13:4-8) యేసుప్రభువు తన శిష్యులకు చెప్పిన ఉపమానమొకటి జ్ఞప్తికొచ్చింది. ఒకరోజు విత్తువాడు విత్తనములను భూమిలో చల్లుతుంటే కొన్ని విత్తనములు త్రోవ ప్రక్కన పడటంతో పక్షులు వచ్చి వాటిని మ్రింగి వేశాయని, కొన్ని రాతినేలను పడి వెంటనే మొలిచినా మన్ను లోతు లేకపోవటంతో సూర్యుని వేడిమికి ఎండిపోయాయనీ, మరి కొన్ని విత్తనములు ముళ్ళ పొదల్లో పడిపోవటంతో



ముళ్ళపొదలు వాటిని అణచివేశాయనీ, అయితే మంచి నేలను పడిన విత్తనములు బహుగా ఫలించాయనీ ప్రభువు తన శిష్యులతో చెప్పిన మాటలు మదిలో మెదిలాయి.

### ఆరంభంలోనే అణచివేత

అసలు ఈ విత్తనముల గురించి ఒక్కసారి ఆలోచించండి. త్రోవ ప్రక్కన పడితే చాలు వీటిని ఎప్పుడెప్పుడు మ్రింగివేద్దామా అన్నట్టు పక్షులు ఎప్పుడూ కాచుకొనే ఉంటాయి. (ఎవరిని మ్రింగుదునా అన్నట్టు వెదకుచూ తిరుగుచుండే వాని వద్ద ట్రైనింగ్ తీసుకున్నట్టు...) పోనీ ఈ పక్షుల బారినుండి తప్పించుకున్నా, ముళ్ళ కంపల మధ్యనే పడాయనుకోండి! ఎండకు ఎండి, వానకు తడిసి, నానా అవస్థలూ పడి ఎలాగోలా కొంచెం మొలకెత్తినా, వాటి ఆశల అంకురాల్ని ముళ్ళ పొదలు నిర్దయగా అణచి పారేస్తాయి. ఆరంభంలోనే ఎదురయ్యే ఈ అణచివేత విత్తువానికి, విత్తనానికీ తీవ్రమైన నిరాశనే మిగుల్చుతుంది.

### పెళ్ళగించేందుకు పన్నాగాలు

ఇక మంచి నేలను పడిన విత్తనముల సంగతి చూడండి. విత్తనములు నాటిన తరువాత మనుష్యులు నిద్రించుచుండగా శత్రువు వచ్చి విత్తనముల మధ్య గురుగులను నాటి పోయాడు. ఆ తరువాత మొలకలు పెరిగి గింజ పుట్టినప్పుడు చూస్తే ఇంకేముంది. గోదుమలతో గురుగులు కూడా అగపడ్డాయి. (మత్తయి 13:24-26) దాంతో దాసులు వెళ్ళి, గురుగులను పెరికి వేస్తామంటూ యజమానుని అనుమతి అడిగారు. అయితే యజమానుడు కొంచెం ఆలోచించి, గోదుమలు ఎదిగే వరకు గురుగులను కూడా, అలాగే ఉండనీయండని వారికి చెప్పాడు గనుక సరిపోయింది గానీ, లేకుంటే గురుగులతో పాటు, గోదుమలు కూడా పెల్లగించబడిపోయేవే.

### చివరిసారి చేసే దాడి

ఇలా వచ్చిన అడ్డంకులన్నీ తట్టుకుని, స్థిరంగా నిలబడి, విత్తనముగా తనకున్న ఐడెంటిటీ (గుర్తింపు)ని కోల్పోయి (గింజ భూమిలో పడి చావాలి. బాహ్య శరీరం భూమిలో కలిసిపోవాలి) ఒక క్రొత్త రూపానికి అంకురార్పణ గావించి, ముప్పదంతలుగానూ, అరువదంతలు గానూ, నూరంతలు గానూ, ఫలిస్తే ఇదిగో ఆ ఫలాన్ని కూడా తన్నుకు పోవడానికి మరలా పక్షులు ఇలా మూకుమ్మడిగా దాడి చేస్తూనే ఉంటాయి. వెరసి విత్తనముల పైన ప్రారంభంలోనూ, ఫలిస్తున్నప్పుడూ, ఫలించిన తరువాత కూడా దాడిచేసే ప్రయత్నాలు ముమ్మరంగా జరుగుతూనే ఉంటాయి. ఈ దాడులన్నింటినీ తిప్పికొడుతూ ఫలసాయం పొందటమే సేద్యం చేయడంలోని చాతుర్యం.

### ముగింపు

అయితే విత్తనమనేది దేవుని వాక్యముతో పోల్చబడిన విషయాన్ని ఒకసారి దైవగ్రంథంలో గమనించండి.(లూకా 8:11) సంతోషంలో అంగీకరించినా శ్రమ కలుగగానే అభ్యంతర పడేవాని హృదయం రాతినేల అయితే, ఐహిక విచారములతో వాక్యమును అణచి వేసేవాని హృదయం ముండ్లపొద, గ్రహించని త్రోవలాంటి హృదయంలో నుంచి వాక్యాన్ని దుష్టుడేలాగూ తన్నుకుపోతాడు గనుక దాని గురించి చెప్పగలిగిందేమి లేదు గాని మంచినేలను పోలిన మానవ హృదయమా! తస్మాత్ జాగ్రత్త! దైవవాక్కు నీ హృదయంలో విత్తబడి, అది ఫలించి ఫలసాయం తిరిగి కొట్లలో కూర్చబడే వరకు నీలోని పైరును పెళ్ళగించడానికి, నీ ఫలాన్ని తన్నుకుపోవడానికి అపవాది అనునిత్యం ప్రయత్నిస్తూనే ఉంటాడు. ఆ ప్రయత్నంలో వాడు ఓడిపోవాలి. నీవు గెలిచి తీరాలి. అది జరగాలంటే నీవు వానికి కర్ణకఠోరమైన శబ్దాలు వినిపిస్తూనే ఉండాలి. నీవు నిరంతరం చెల్లించే స్తుతులే వాడిని పారద్రోలే కఠోరమైన శబ్దాలని నీవు గమనించాలి. సదా వినిపించాలి. అట్టి కృప ప్రభువు నీకు దయచేయును గాక! ఆమేన్!!



(5వ పేజి తరువాయి)

సహాయ సహకారాలు అని వినయంగా మనవి చేస్తున్నాను. దేవునికే మహిమ!

నా మనసులోని ఆశలను, ఆలోచనలు నేను ముందుగా ప్రభువు సన్నిధిలో ఉంచుతాను. ఈ పరిచర్యలకు ప్రార్ధనా సహకారులైన మీతో పంచు కుంటున్నాను, మీరూ ప్రార్ధించి సహకరిస్తున్నారు.

మరో ప్రాముఖ్యమైన విషయం - గ్రామాల్లో దేవుని సేవ చేసే సేవకులు అనేకమందిని కలుస్తుంటాను. వారి బాగోగులు అడుగుతుంటాను, అనేకమంది సేవకులు చాలా ఇబ్బందుల్లో ఉన్నారు. చాలా మందికి గ్రామాల్లో సరైన మందిరాలు లేవు, చెట్టు నీడన, చిన్న చిన్న పాకల్లో, చాలీచాలని స్థలాల్లో ఆరాధనలు జరుపుకునే సేవకులు ఎందరో ఉన్నారు. కొందరిదైతే మరీ దీన స్థితి! ఓ గ్రామంలో కానుకలు చాలినంతగా రాక తినటానికి కూడా కష్టమయి పాస్టరమ్మ గారు కొడవలి పట్టుకుని చేను కోయటానికి కూలికి వెళ్లి వచ్చిన కూలితో పిల్లలకు భోజనం చేసిందని తెలిసినపుడు నాకు కంట నీరు ఆగలేదు. నేను చేయగలిగినంత సాయం ఈ కుటుంబానికి చేశాను. **కీర్తన 35. 27 'తన సేవకుని క్షేమమును చూచి ఆనందించు యెహోవా ఘనపరచబడును గాక!'** అనే వాక్య వాగ్దానాన్ని చేత పట్టుకుని ఇలాంటి దేవుని సేవకులను మనము ఆదరిద్దాము, పోషిద్దాము.

పాఠకులలో ప్రేరేపించబడిన వారు, దేవుని సేవకులను పోషించటానికి ఆర్ధికంగా సహకారమివ్వాలని కోరుతున్నాము. మీరిచ్చే సహకారాన్ని అందుకున్న తరువాత ఆ సేవకులు మీకు ఫోన్ చేసి వందనాలు చెప్పటానికి వీలుగా మీ ఫోన్ నంబరుకూడా తప్పక రాయాలని మనవి చేస్తున్నాను. ఒక్కో కుటుంబాన్ని పోషించటానికి కనీసం ఓ 500 మనం పంపగలిగితే బాగుంటుంది.

మా పాఠకులు మీరు కానుక పంపగానే పోస్టలు అక్నాలెడ్జ్‌మెంట్ వచ్చిందా లేదా అని పరీక్షించండి. అలాగే స్పందన ఆఫీసుకు మీరు పంపే చందాలు గాని లేదా సేవా కానుకలు గాని అందిన వెంటనే రశీదు పంపుతూ మీకు ఉత్తరం రాస్తాము. ఉత్తరం రాకపోతే మీరు పంపిన డబ్బు మాకు అందలేదని గుర్తించగలరు.

ఆన్‌లైన్‌లో కొందరు అప్పుడప్పుడు కానుకలు పంపుతున్నారు. అలా కానుకలు పంపేవారు వెంటనే ఫోన్‌లో గాని యస్‌యంయస్ ద్వారా గానిమీ అడ్రసు, ఫోన్ తెలియజేయాలని మనవి. మీ ఫోన్ నంబరు మా వద్ద ఉంటే వెంటనే నేను మీతో ఫోన్‌లో మాట్లాడుతాను.

మరో మాట! స్పందన మీరు చదువుతుండగా మీకు ఏ వ్యాసం నచ్చిందో, ఆత్మసంబంధంగా మీరు ఎలా బలపడ్డారో వివరంగా రాయాలని మనవి. తద్వారా మీకు నచ్చే వ్యాసాలేంటో మాకూ అర్ధమవుతుంది. టి. వి కార్యక్రమాల ద్వారా కూడా మీరు ఎలా దీవించబడ్డారో వివరంగా రాస్తే సాక్ష్యంగా అనేకులకు తెలియజేయటానికి వీలవుతుంది.

స్పందన రాగానే 'మనలో మాట' ముందుగా చదువుతాము, అని నాతో అనేక మంది పాఠకులు చెబుతూ ఉంటారు. ఈ రెండు పేజీలను ఓపికతో చదివిన మీకు నా ప్రత్యేక అభినందనలు. మీరు, మేము కలిసి దేవుని రాజ్యాని కట్టటానికి, ఆయన నీతిని ప్రచురము చేయటానికి ప్రయాస పడుదాం! దేవుని దీవెనలు, ఆశీస్సులు ఎప్పుడూ మనకు తోడుగా ఉంటాయి.

దైవజనులు ఆచార్య ఆరార్కె మూర్తయ్య గారి ఆరోగ్యం కోసం మీ నిత్య ప్రార్ధనల్లో జ్ఞాపకముంచుకోవాలని మనవి.

దేవుడు మిమ్మును సమృద్ధిగా ఆశీర్వదించును గాక!

ప్రభువు సేవలో సోదరుడు - **దేవ దండల**

**ముఖ్య విషయం**

**- స్పందన చందాదారులందరూ మీరు మీ కానుకలు, చందాలు పంపేటప్పుడు దయచేసి మీ సెల్ నంబరును తప్పక తెలియజేయాలని మనవి. మీరు పంపిన డబ్బు అందగానే మీ డబ్బు అందిందని, మీ చందా అయిపోయినప్పుడు వెంటనే SMS మెసేజ్ మీ సెల్‌కు వస్తుంది. విషయాలు ఎప్పటికప్పుడు మీకు తెలియజేయటానికి అనువుగా ఉంటుంది. తప్పక మీ సెల్ నంబరు పంపాలని మనవి.**

**- సర్క్యులేషన్ ఇన్‌చార్జ్**

సజీవ సాక్షులు



భట్టిప్రోలు

# శాంతి, సువార్త మహోత్సవాలలో సహో.విజయశేఖర్ గారి పట్ల దేవుడు చేసిన అద్భుతకార్యములు

(ప్రభువునందు ప్రియమైన సహో.దండల దేవసహాయం గారికి నా హృదయ పూర్వక కృతజ్ఞతావందనములు.)

నా పేరు దారా విజయశేఖర్. నేను ఆంధ్రప్రదేశ్ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల జూనియర్ కళాశాల, కారంపూడి గుంటూరు జిల్లానందు గత 5 సం॥ 11 నెలలుగా పనిచేయుచున్నాను. దేవుడు నాపై చూపిన తన ఉచితమైన కృపను బట్టి ఆయనకు ఎనలేని స్తుతులు మా కుటుంబ పక్షాన సమర్పిస్తున్నాను.

గత మే నెలలో ట్రాన్స్‌ఫర్స్ నిమిత్తం ప్రభుత్వం జి.ఓ జారీ చేయుచుండగా ఎంతో కలవరపడ్డాము. ఎందుకంటే నా భార్య నర్సరావు పేట, గుంటూరు జిల్లాలో టీచరుగా పనిచేస్తుంది. నాకు ట్రాన్స్‌ఫర్ అయితే ప్రకాశం జిల్లాకు గాని, నెల్లూరు జిల్లాకు గాని అయ్యే అవకాశం ఉంది.

ఆ సమయంలో మా కుటుంబమంతా దేవునికి ప్రార్థించాము. దేవుడు సెలవిచ్చినట్లుగా ***"నరులను ఆశ్రయించుట కంటే యెహోవాను ఆశ్రయించుట మేలని"*** ఆయన వాగ్దానము పట్ల విశ్వాసము కలిగియున్నాము. ఈ సంవత్సరము మే నెల 29, 30 తేదీలలో భట్టిప్రోలు గ్రామము గుంటూరు జిల్లాలో సహో. దండల దేవ అన్న గారి ఆధ్వర్యంలో జరుగుచున్న శాంతి, సువార్త మహోత్సవములకు మేము వెళ్ళాము.

ఆ కూడికలలో నేను చెవి నొప్పి గురించి బదిలీ విషయమై దేవన్న గారికి తెలియజేసినాను. మొదటి రోజు కూడిక అనంతరం నా చెవినొప్పి సమస్య పూర్తిగా తొలగి సంపూర్ణమైన స్వస్థతను పొందుకున్నాను. రెండవరోజు కూడికలో నా యీ సాక్ష్యమును సభలో అందరి ముందు, దేవుడు నా యెడల చేసిన అనేకమైన మేలులను కూడా తెలియజేశాను. ఆ రాత్రి కూడికల అనంతరం గవర్నమెంట్ ట్రాన్స్‌ఫర్స్ జి.ఓ నాకు అనూకూలంగా వచ్చింది. ది. 10-6-2011 గుంటూరులో జరిగిన కౌన్సిలింగ్‌లో మా అధికారులు ప్రకాశం, నెల్లూరు జిల్లాలలో ఖాళీలు ఉన్నాయని, అక్కడికి వెళ్ళాలని తెలియజేశారు. నేను గుంటూరు జిల్లాలోనే కావాలని ఆశించాను. "ఆయన నీ హృదయ వాంఛలను తీర్చును" అన్న వాగ్దానం ప్రకారం దేవుడు అన్నగారి ప్రార్థన ద్వారా మరియు ఆ రోజు సభలో అనేకమంది నా గురించి ప్రార్థించినట్లు నాకు ఇష్టమైన అచ్చంపేట, గుంటూరు జిల్లాలోనే దేవుడు నాకు అవకాశం కల్పించారు. ఇందును బట్టి దేవునికి నా యొక్క వందనములు తెలుపుచున్నాను.

ఈ చిన్న సాక్ష్యమును పాఠకులకు ఆశీర్వాద కారణంగా దేవుడు దీవించి ఆశీర్వదించునని నమ్ముతున్నాను. దేవ అన్న గారి అనేక ప్రాంతాలకు వ్యాపించాలని ప్రార్థిస్తూ, ఆశిస్తున్నాను.


**డా॥ దేవ దండల గారి రచనలు**

దేవుని ఆత్మ ప్రేరేపణతో డా॥ దేవసహాయం దండల గారు తమ స్వానుభవంలోనుండి వారు రాసే వ్యాసాలు, ఆత్మపూర్ణులై ఆత్మాభిషేకంతో స్పందన టివి కార్యక్రమాల్లో గాని, శాంతి సువార్త సభల్లో వారి సందేశాలు ఎందరినో ఆదరించి ఆధ్యాత్మికంగా బలపరచాయి. అనేక జీవితాలు, కుటుంబాలు ప్రభువు నామ మహిమార్థం కట్టుకోటానికి ఉపయోగపడిన ఈ ఆత్మపూర్ణ సందేశాలు పుస్తకాలుగా పొందుపరచి ప్రచురణకు సిద్ధంగా ఉన్నాయి. పాఠకులు ప్రారించాలని ప్రభువు మిమ్మును ప్రేరేపిస్తే ఆర్థికంగా సహకరించాలని మనవి. డా॥ దేవ సెల్ **9948335222**



బ్రదర్.కె.పరమానందం

# యెహోవా భయము ఐశ్వర్యము

## దైవ భయము

దేవుని ప్రార్థించాడానికి సమీపించడానికి భయముకాదిది – ఇది దేవుని పట్ల సవ్యముతో కూడిన గౌరవం. పాపము చేసి ఆయనకు కోపం తెప్పిస్తామేమోనన్న భయం. మనుష్యులకు దైవభయం ఉండడం చాలా ప్రాముఖ్యమైన సంగతి. ఇది చెడు కార్యాలను చెయ్యకుండా అడ్డగిస్తుంది. దేవుని మాట వినడానికి ఇది ప్రేరకం, ఇది జ్ఞానానికి ఆరంభం, దీనికి ఫలితం దేవుని అమోఘమైన ఆశీర్వాదాలు. మానవజాతి అంతటికి ఇది విధి. ఇది లేకుండా మానవులు కీడులో పడతారు. మనమందరము దేవుని భయము కోసం ప్రార్థించాలి. దైవభయము కొరకు దావీదు ప్రార్థన – **"యెహోవా నేను నీ సత్యము ననుసరించి నడుచుకొనునట్లు నీ మార్గమును నాకు బోధింపుము. నీ నామమునకు భయపడునట్లు నా హృదయమునకు ఏకదృష్టి కలుగజేయుము. (కీర్తన 86:11)**

రాజైన సొలోమోను యెహోవా యందలి భయభక్తులు కలిగి యుండుటను గూర్చి తాను వ్రాసిన సామెతలు గ్రంథములో అనేక విషయాలు వివరముగా వ్రాసియున్నాడు.

**యెహోవాయందు భయభక్తులు కలిగియుండుట.....**

1. **తెలివికి మూలము. 1:7**
2. **చెడుతనము నసహ్యించుకొనుటయే. 8:13**
3. **జ్ఞానమునకు మూలము. 9:10**
4. **దీర్ఘాయువునకు కారణము. 10:27**
5. **బహుధైర్యము పుట్టించును. 14:26**
6. **జీవపు ఊట. 14:27**
7. **జ్ఞానభ్యాసమునకు సాధనము. 15:33**
8. **మనుష్యులు చెడుతనము నుండి తొలగిపోవుదురు. 16:6**
9. **జీవ సాధనము...19:23**
10. **వినయ మునకు ప్రతిఫలము...22:4**

దేవుని జ్ఞానమైన యేసుక్రీస్తు ప్రభువును రక్షకునిగా అంగీక రించి, మారుమనస్సు పొంది ప్రార్థించుము.

**క్రీస్తే జ్ఞానము:** బుద్ధిజ్ఞానముల సర్వసంపదలు క్రీస్తునందే గుప్తములు (కొల 2:3). క్రీస్తు దేవుని శక్తియు, దేవుని జ్ఞానమునైయున్నాడు. క్రీస్తు జ్ఞానము దేవుని యొక్క అవతారము. ప్రభువైన యేసు దేవుని కుమారుడుగా ఈ లోకములో అవతరించి పరిశుద్ధాత్మవలన కన్య మరియ గర్భము నందు జన్మించి, బెత్లెహేము



పశువుల తొట్టిలో పరుండినవాడై సమస్తమును సృష్టించినవాడు. ఆయన పరమదేవుడై యుండి దేవుని కుమారుడుగా కృపాసత్యముల సంపూర్ణతను తన శరీర మందిముద్దుకొని మనుష్యుల మధ్య నివాసమేర్పరచుకొన్నాడు. అందరిని ప్రేమించి మనలను పాపము నుండి విడిపించి పరమున చేర్చుటకు మనకు బదులుగా సిలువ శిక్షననుభవించి సిలువలో రక్తము చిందించి మరణించి మన పాప ఋణమనును తీర్చి, సమాధి చేయబడి తిరిగి మూడవ దినమున పునరుత్థానుడై పరమునకేగి తండ్రి కుడిపార్శ్వమున కూర్చుండి మన కొరకు విజ్ఞాపన చేయు చున్నాడు. నేడే రక్షకుడైన క్రీస్తు యేసు ప్రభువును అంగీకరించి పాపశిక్షనుండి విడుదల పొందుము.

దేవుని వాక్యమునకు లోబడు వారికి జ్ఞానియైన సొలోమోను ఈ విధంగా తెలియజేస్తున్నాడు. "నీ స్వబుద్ధిని ఆధారము చేసికొనక నీ పూర్ణ హృదయముతో యెహోవా యందు నమ్మికయుంచుము. నీ ప్రవర్తన అంతటియందు ఆయన అధికారమునకు ఒప్పుకొనుము." (సామె 3:5,6) దైవభయము కలిగి విధేయుడవై దేవుని వాక్యమునకు లోబడి దేవుని బిడ్డవైతే 'యెహోవా భయమువలన ఆయనిచ్చు ఆత్మీయ ఐశ్వర్యమును పొందగలవు.

**యెహోవా భయముతో ఆత్మీయ ఐశ్వర్యవంతులైన దైవజనులు కొందరు:**

**అబ్రాహాము:** అబ్రాహాము వృద్ధాప్యములో జన్మించిన తన ఏకైక కుమారుని బలియిచ్చుటకు తీర్మానము చేసికొనినప్పుడు పరలోకము నుండి యెహోవా దూత "అబ్రాహామా, అబ్రాహామా" అని అతని పిలిచినప్పుడు అబ్రాహాము "చిత్తము ప్రభువా" అన్నాడు. అప్పుడు ఆయన ఆ చిన్నవాని మీద చెయ్యి వేయకుము. అతనినేమియు చేయకుము. నీకు ఒక్కడైయున్న నీ కుమారుని నాకియ్య వెనుతీయలేదు గనుక 'నీవు దేవునికి భయపడువాడవని యిందువలన నాకు కనబడుచున్నదనెను.'' (ఆది 22:11,12)

**యోసేపు:** ఐగుప్తీయుడగు పోతిపరు యింట యున్నప్పుడు దైవభయము కలిగిన యోసేపు పోతిపరు భార్యతో పలికిన మాట "నీవు అతని భార్యవైనందున నిన్ను తప్ప మరి దేనిని నాకప్పగింపక యుండలేదు. కాబట్టి నేనెట్లు ఇంత ఘోరమైన దుష్కార్యము చేసి దేవునికి విరోధముగా పాపము కట్టుకొందునని" అనెను. (ఆది 39:9) అక్కడనుండి పారిపోయెను. మరి కొంతమంది భక్తులు

- నోవాహు (హెబ్రీ 11:7; ఆది 6:14)
- నెహెమ్యా (5:15),
- యోబు (1:1,8),
- ప్రథమ క్రైస్తవ్యులు (అ.కార్య 9:31),
- కొర్నేలి (అ.కార్య 10:2)

ప్రియ పాఠకా! యెహోవా యందు భయభక్తులు కలిగి మనము కూడా ఆత్మీయ ఐశ్వర్యమునకు పాత్రులమవుదాం. దేవుడు మిమ్మును సమృద్ధిగా దీవించును గాక!

## ఈ మాసం పాట

పల్లవి-

నిబ్బరం కలిగి ధైర్యముగ ఉండూ
దిగులుపడకు, జడియకు ఎపుడూ
నిన్ను విడువడు, నిన్ను మరువడు
ప్రభువే నీతోడు

అను పల్లవి -

హల్లేలూయామేన్...హల్లేలూయా
ఊరక నిలిచి ప్రభువు చూపే రక్షణ చూద్దాము
నీ శత్రువులు ఇకపైనెపుడూ కనబడరందాము
హల్లేలూయామేన్...హల్లేలూయా

1) పర్వతాలు తొలగినా, మెట్టలు దద్దరిల్లినా
ప్రభు కృప మమ్మును విడువదుగా
ఎక్కలేని ఎత్తయిన కొండను
ఎక్కించును మా ప్రభు కృప మమ్మును
ప్రభువే మా బలము ॥హల్లేలూయా॥

2) మునుపటికంటేను అధికపు మేలును
మా ప్రభు మాకు కలిగించును
రెట్టింపు ఘనతతో మా తలను ఎత్తును
శత్రువుయెదుటనే భోజనము ఇచ్చును
ప్రభువే మా ధ్వజము ॥హల్లేలూయా॥

3) మా అంగలార్పును నాట్యముగా మార్చెను
బూడిద బదులు సంతోషమిచ్చెను
దుఃఖ దినములు సమాప్తమాయెను
ఉల్లాస వస్త్రము ధరియింప జేసెను
ప్రభునకే స్తోత్రం ॥హల్లేలూయా॥

4) స్త్రీ తన బిడ్డను మరచిన మరచును
మా ప్రభు మమ్మును మరువడుగా
చూడుము నా అరచేతిలోనే
చెక్కితి నిను అన్నాడు ప్రభువు
ప్రభువే చూచుకొనును ॥హల్లేలూయా॥

5) రాబోవు కాలమున సమాధాన సంగతులే
మా ప్రభు మాకై ఉద్దేశించెను
ఇదిగో నేనొక నూతన క్రియను
చేయుచున్నానని మా ప్రభువు చెప్పెను
ఇప్పుడు అది మొలుచున్॥హల్లేలూయా॥

6) మేము కట్టని పురములను
మేము నాటని తోటలను
మా ప్రభువు మాకు అందించును
ప్రాకారముగల పట్టణములోనికి
ప్రభువే మమ్మును నడిపింపజేయును
ప్రభువే మా పురము ॥హల్లేలూయా॥

(దైవజనులు అనిల్‌కుమార్ గారి అద్భుతమైన పాటల్లో నుండి ఒకటి)

**బైబిల్ స్టడీ**

## బైబిలు మకరందము

# దైవత్వములోని త్రిత్వము


అనువాదం-
ఆచార్య ఆరార్కే మూర్తి,
ఆచార్య గుజ్జర్లమూడి కృపాచారి





**ఎ) క్రొత్త నిబంధనలో దేవుని సంపూర్ణ నామము తండ్రి, కుమార, పరిశుద్ధాత్మ.**

మత్తయి 28:19; 2 కొరింథీ 13:14. పాత నిబంధనలో **"దేవుడు తండ్రి"** అని 14సార్లు, కొత్త నిబంధనలో 200సార్లుపేర్కొనబడింది. యేసుక్రీస్తు దేవుని కుమారుడు, దేవుడు కూడా. 'ఆ వాక్యము దేవుడై ఉండెను.' యోహాను 1:1. 'ఆయన నిజమైన దేవుడు'. 1 యోహాను 5:20. 'సర్వాధికారియైన దేవుడు'. రోమా 9:5. 'మహాదేవుడు'. తీతు 2:13. 'పరిశుద్ధాత్మ కూడా దేవుడని పేర్కొనబడ్డాడు'. అ.కార్య 5:3-9. 'ప్రభువే ఆత్మ' అని 2 కొరింథీ 3:17లో పేర్కొనబడింది.

యేసు బాప్తిస్మం పొందినపుడు తనకు కుమారునికి మధ్య సంబంధాన్ని ప్రకటించి సాక్ష్యమిచ్చాడు. పరిశుద్ధాత్మ దిగిరావటం కనబడింది. కుమారుడు నీతి యావత్తు నెరవేర్చాడు. లూకా 3:22, యోహాను 1:32.


మత్తయి 28. 18, 19. యేసుప్రభువు తన శిష్యులకు చివరి ఆజ్ఞ యిస్తూ, తండ్రియొక్క, కుమారుని యొక్క, పరిశుద్ధాత్మ యొక్క నామంలోనికి బాప్తిస్మం యివ్వాలని ఆదేశించాడు. ఆ ఆజ్ఞలో త్రిత్వంలో ముగ్గురు కలసి ఒకే నామము గలవారని తేటపడుతున్నది.

**బి) దేవుని లక్షణాలు, తండ్రి కుమార పరిశుద్ధాత్మలకు సమానం ఆరోపించబడ్డాయి.**

1) తండ్రి, 'యుగయుగాలకు దేవుడు'. కీర్తన 90:2. కుమారుడు, 'ఆది అంతము' అయి ఉన్నాడు. ప్రకటన 1:8-17. పరిశుద్ధాత్మ 'నిత్యుడైన ఆత్మ'. హెబ్రీ 9:14

2) **సర్వశక్తి** ఈ ముగ్గురికీ ఆపాదించబడింది. 'దేవుని శక్తి చేత కాపాడబడుతున్నాము'. 1 పేతురు 1:5. తండ్రిని గురించి -. 'క్రీస్తు శక్తి నామీద నిలచి ఉండు నిమిత్తము' అంటూ 2 కొరింథీ 12:6లో కుమారుని -. 'దేవుని పరిశుద్ధాత్మ బలం చేత..' రోమా 15:19లో పరిశుద్ధాత్మ గురించి చెప్పబడింది.

3) ముగ్గురు సర్వజ్ఞులే. **"యెహోవా అనే నేను హృదయాలను పరిశోధించే వాడను"** యిర్మియా 17:10. యిది తండ్రిని గురించి చెప్పబడింది. **"అంతరింద్రియాలను హృదయాలను పరీక్షించేవాడని"** ప్రకటన 2:23లో కుమారుణ్ని గురించి చెప్పబడింది. **"దేవుని సంగతులు దేవుని ఆత్మకే గాని మరి ఎవరికి తెలియవని"** 1 కొరింథి 2:11లో పరిశుద్ధాత్మను గురించి చెప్పబడింది.



4) త్రిత్వములోని ముగ్గురు **సర్వవ్యాప్తి** అని చెప్పబడింది. తండ్రిని గురించి, **'నేను భూమ్యాకాశములందంతట ఉన్నవాడను కానా?'** యిర్మియా 23:24. కుమారుని గురించి **'అక్కడ నేను వారి మధ్యన ఉంటాను'** మత్తయి 18:20. ఆత్మను గురించి, **"ఆత్మ యొద్దనుండి నేనెక్కడికి పోగలను"** కీర్తన 139:7

5) త్రిత్వములో ప్రతి ఒక్కరు **పరిశుద్ధులే. 'తండ్రీ, ప్రభువా నీవు మాత్రమే పవిత్రుడవు.'** ప్రకటన 15:4. కుమారుడు **'మీరు పరిశుద్ధుడు నీతిమంతుడు అయిన వానిని నిరాకరించారు.'** అ.కార్య 3:14 ఇక ఆత్మను గురించి ఆయన నామమే **'పరిశుద్ధాత్మ'.**

6) త్రిత్వములో ముగ్గురు **సత్యవంతులే.** తండ్రిని గూర్చి కుమారుడిచ్చిన సాక్ష్యం. **'నన్ను పంపినవాడు సత్యవంతుడు'.** యోహాను 7:28. క్రీస్తును గూర్చి **'నేనే సత్యమును'** అన్నాడు ప్రభువు. ఆత్మను గూర్చి **'సత్యస్వరూపి'** అని 1 యోహాను 5:6 చెబుతున్నది.

7) త్రిత్వములోని ముగ్గురు **మంచితనము, ప్రేమ** కలిగి ఉన్నారు. **'దేవుని అనుగ్రహం', 'దేవుడు ప్రేమస్వరూపి'.** రోమా 2:4, 1 యోహాను 4:3. **'క్రీస్తు సంఘమును ప్రేమించాడు'** అంటూ ఎఫెసీ 5:25 చెబుతుంది. **'ఉపకారాత్మ'.** నెహెమ్యా 9:20

**సి) సృష్టి కార్యములన్నీ త్రిత్వమందున్న ముగ్గురి ద్వారా చేయబడినవి.**

1) 'ప్రపంచ నిర్మాణం' త్రిత్వములోని ప్రధమ వ్యక్తి అయిన తండ్రి చేత ప్రత్యేకముగ చేయబడింది. కీర్తన 102:25 క్రీస్తును గూర్చి 'ఆయన సర్వము సృజించి ఉన్నాడని' రాయబడింది. కొలస్సీ 1:16. ఆయన ఆత్మచేత ఆకాశములు సృజించబడ్డాయి. ఆత్మ దేవుని ఊపిరి అని పేర్కొనబడింది. యోబు 26:13. దేవుని ఆత్మ అగాధ జలముల మీద అల్లాడుతూ ఉన్నది. ఆదికాండం 1:2

2) మనుష్యుణ్ని సృష్టించే పని త్రిత్వములోని ముగ్గురు వ్యక్తులు కలిసి చేసిన పని. యెహోవా ఎలోహిమ్, నరుని రూపమును ధరించాడు. ఆది. 2:7. క్రీస్తు ద్వారా సర్వము సృజించబడింది. కొలస్సీ 1:16. 'దేవుని ఆత్మ నన్ను సృజించాడు'. యోబు 33:4


మంచి గ్రంథాల పరిచయం

## ప్రవచనముల నెరవేర్పు



దేవుని ఆత్మనడిపింపుతో శ్రీమతి లిల్లీ భాస్కర రావు గారి కలం నుండి జాలువారిన మరో ఆణిముత్యం, "ప్రవచనముల నెరవేర్పు". గతంలో 'వధింపబడిన దేవుని గొర్రెపిల్ల' 'సంఘములో స్త్రీలు మాట్లడ వచ్చునా?' అనే పుస్తకాలను రచించారు. ఇది మూడవది. ఈ పుస్తకంలో పాత నిబంధన ప్రవక్తల నుండి క్రొత్త నిబంధన ప్రవక్తల వరకు ప్రవచించిన ప్రవచనాలు - వాటి నెరవేర్పు యింకా నెరవేరవలసిన ప్రవచానాలు, అంత మాత్రమే కాకుండా కలలు - వాటి భావాలు, దర్శనములు - వాటి నెరవేర్పు ఎంతో వివరంగా రచించారు. ఈ గ్రంథం చదువుతున్నప్పుడు సర్వజ్ఞుడైన దేవుని ఆంతర్యాన్ని సరైన రీతిలో అవగాహన చేసుకొని, విశ్వాస జీవితాన్ని మలచుకోడానికి ఎంతో ఉపయోగపడుతుంది. ఈ గ్రంథపఠన ద్వారా దేవుని రాకడకు మనల్ని మనం ఏ విధంగా సిద్ధపర్చుకోవాలో విశదమౌతుంది. విశ్వాసులకు, దైవ సేవకులకు, సత్యాన్వేషకులకు ఎంతో ఆశీర్వాదకరమైన గ్రంథం. వెంటనే మీ కాపీని తెప్పించుకోండి కాపీలు పరిమితం. బుక్‌స్టాల్స్ వారికి ప్రత్యేక తగ్గింపు కలదు.

శ్రీమతి ఎన్.లిల్లీ భాస్కర్ గారు

10-53-296, గ్రేస్ ల్యాండ్, ఎల్.ఐ.జి 23, నెహ్రూనగర్ కాలనీ, విశాఖపట్నం - 530 002

ఫోన్: 0891-2566958, మొబైల్ - 9290998200



ఆచార్య ఆరార్కే

రేడియో పాఠం


# ప్రకటన గ్రంథ పరమ సత్యాలు

ప్రకటన గ్రంథం కాల విభజన గూర్చి చెప్పబడింది. యోహాను నీవు చూచినవాటిని వ్రాయి. **భూతకాలం,** యోహాను యేసును చూచాడు. ఆయనయందే తన దృష్టిని కేంద్రికరించాడు. ప్రకటన గ్రంథం క్రీస్తు కేంద్రిత గ్రంథం. ఆయనే కేంద్రాకర్షణ. గుర్రాలు కాదు రౌతులు కాదు, ఉగ్రత పాత్రలు కాదు, మృగాలు కాదు. యేసు కేంద్రంలో ఉన్న గ్రంథం ప్రకటన గ్రంథం. ఇక వర్తమాన కాలం, ఉన్నవాటిని గురించి వ్రాయి. ఏమిటా సంగతులు? సంఘమే! రెండు, మూడు అధ్యాయాలలో సంఘము గురించి ఉన్నవాటిని వ్రాయి. **భవిష్యత్తు కాలం,** వీటివెంట కలుగబోయేవాటిని గూర్చి వ్రాయి. నాలుగు నుండి ఇరవైరెండో అధ్యాయం వరకు జరుగబోయేవే. సంఘం ఎత్తబడుతుంది. అప్పుడు ఇక్కడ జరుగబోయే సంగతులు ఎన్నో ఉన్నాయి. అవన్నీ యోహాను చేత యేసుప్రభువు వ్రాయిస్తున్నాడు.

### ఏడు నక్షత్రాలు - ఏడు దీపస్థంభాలు

ఇక ఏడు నక్షత్రాలు, ఏడు దీపస్థంభాల విషయం. పాఠకులు ఈ సందర్భంలో గ్రహించాలి, యోహాను సంకేతాలు వ్రాస్తున్నప్పుడు ఇవి సంకేతాలు అని స్పష్టంగా చెబుతాడు. లేకపోతే వాటిని మనం అక్షరార్థంగా తీసుకోవాల్సిందే. ప్రతి ఒక్కటి సంకేతమనుకుంటే మీకు ఈ గ్రంథం అర్థం కాదని మనవి చేస్తున్నాను. ఏడు నక్షత్రాలు, ఏడు దీపస్థంభాలు. ఏడు నక్షత్రాలను గూర్చిన మర్మమా! మర్మమంటే పవిత్రరహస్యం. అంతకుముందు ఎన్నడూ బయలు పరచబడనిదేదో అదే మర్మం. యోహానుకు మాత్రమే అది బయలు పరచబడింది. గనుకే అది మర్మం. ఇప్పుడైతే అది బయలు పరచబడింది. మహిమలోని క్రీస్తును చూచినవాడు యోహానే!

మరి పౌలు! పౌలు ఏమి చూచాడు? అ.కార్య 26:13 "మధ్యాహ్నమందు నా చుట్టూ, నాతో కూడా వచ్చినవారి చుట్టూ ఆకాశమునుండి సూర్యతేజస్సుకంటే మిక్కిలి ప్రకాశమానమైన ఒక వెలుగు" త్రోవలో ప్రకాశించడం చూచాడు. అంతే సూర్యుణ్ణి కాదు ప్రకాశాన్ని మాత్రమే చూడగలిగాడు. దానికే పౌలు కండ్లు దెబ్బతిని కొన్నిరోజులపాటు గ్రుడ్డివాడైపోయాడు. కాని యోహాను మహిమలోని క్రీస్తును ప్రత్యక్షంగా చూచాడు. మహిమలోని క్రీస్తును పూర్తిగా చూచినవాడు యోహాను. దేవునికి స్తోత్రం! ఏడు నక్షత్రాలు ఏడుగురు



దూతలు. నక్షత్రం అధికారానికి సంకేతం. యూదా పత్రిక 13 వ వచనంలో **"మార్గము తప్పి తిరిగే చుక్కలు".** తప్పుడు బోధకులు దారితప్పిన నక్షత్రాలు. దూత అంటే వార్తావహుడు. అతడు మనిషి కావచ్చు దేవదూత కావచ్చు. అతడు బోధకుడు కావచ్చు, ఉపదేశకుడు కావచ్చు. రెండు మూడు అధ్యాయాలలో సంఘపు దూతలు సంఘకాపరులు. కాపరికి దూత అనే పేరు ఎంతో అర్థవంతమైనది. ఏడు దీపస్థంభాలు ఏడు సంఘాలు. దీపాలను కలిగి ఉన్న స్థంభాలు దీప స్థంబాలు. ఆసియాలో ఉన్న ఏడు సంఘాలు, ఈ ఏడు సంఘాలు కలిసి దేవుని సంఘము యొక్క సమగ్ర రూపాన్ని చూపుతాయి అని మనం గ్రహించాలి. ప్రియ పాఠకులారా! ప్రకటన గ్రంథం మొదటి అధ్యాయం ముగిసింది.

**ప్రకటన గ్రంథానికి ఆదికాండానికి ఉన్న సంబంధం** మీరెప్పుడైనా గుర్తించారా?

| *ఆదికాండంలో* | *ప్రకటన గ్రంథంలో* |
| --- | --- |
| – భూమి సృజింప బడింది. | – భూమి అంతరించింది. |
| – సైతాను మొదటి తిరుగుబాటు | – సైతాను చిట్టచివరి తిరుగుబాటు |
| – సూర్యుడు, చంద్రుడు, నక్షత్రాలు భూమిని ఏలాయి | – సూర్యునితో నిమిత్తమే లేదు |
| – సముద్రాలు ఏర్పాడ్డాయి | – సముద్రమే లేకుండా పోయింది |
| – పాపం ప్రవేశించింది | – పాపం గతించింది |
| – శాపం వచ్చింది | – శాపం తొలగిపోయింది |
| – మరణం ప్రవేశించింది | – మరణం పోయింది |
| – దుఃఖం, శ్రమ, బాధ వచ్చాయి | – దుఃఖములేదు, కన్నీరు లేదు |
| – మొదటి ఆదాము వివాహం | – కడపటి ఆదాము వివాహం |
| – మానవ నిర్మితమైన నగరం బబులోను | – బబులోను నాశనం, నూతన యెరూషలేము నిర్మించబడింది |
| – సైతాను నాశన ప్రవచనం | – ప్రవచన నెరవేర్పు |
| – ఆది 1:1 "ఆదియందు దేవుడు భూమ్యాకాశాలను సృజించాడు." విశ్వవ్యాప్తమైన దృశ్యం. | – కొత్తభూమి కొత్త ఆకాశం దేవుడు చేస్తున్నాడు. |

*ప్రకటన గ్రంథంలాంటి పుస్తకం మరోకటి లేదు. దేవునికి స్తోత్రం.*

**ప్రభువు సంఘము**

రెండు మూడు అధ్యాయాలు సంఘమే. ఆ రెండు అధ్యాయాలలోని అంశం, సంఘానికి యజమాని యేసే. సంఘమనే మందకు యేసే ప్రధాన కాపరి. సంఘమంటే గ్రీకు బాషలో "ఎక్లేషియా" అనగా లోకములోనుండి పిలువబడింది. కొలస్సీ 1:13 లో **"ఆయన మనలను అంధకార సంబంధ అధికారమునుండి విడుదల చేసి తాను ప్రేమించిన తన కుమారుని యొక్క రాజ్య నివాసులనుగా చేశాడు."** సంఘం మనగా దేవుని రాజ్యనివాసుల సమాజం. 1 పేతురు 2:9 సంఘమంటే ఎవరనుకున్నారు? **"మీరు చీకటిలో నుండి ఆశ్చర్యకరమైన తన వెలుగులోనికి మిమ్మును పిలిచినవాని గుణాతి శయములను ప్రచురము చేసే నిమిత్తము ఏర్పరచబడిన వంశము, రాజులైన యాజక సమూహము, పరిశుద్ధ జనము, దేవుని సొత్తయిన ప్రజలు."** ప్రభువే స్వయంగా అన్నాడు **"నా సంఘమును నేను కడతాను, పాతాళలోక ద్వారములు దాని యొదుట నిలువలేవు"**

**సంఘ విజయం**

సంఘం పాడే విజయగీతిక అపొస్తలుడైన పౌలు 1 కొరింథీ 15:54-57 వరకు రాశాడు. ఇది సంఘవిజయం. ఈ క్షయమైనది అక్షయతను ధరించుకొన్నప్పుడు, ఈ మర్త్యమైనది అమర్త్యతను ధరించు కొన్నప్పుడు విజయ మందు మరణము మ్రింగి వేయ బడినది అని వ్రాయబడిన వాక్యము నెరవేరు తుంది. 'ఓ మరణమా నీ విజయ మెక్కడ? ఓ మరణమా నీ ముల్లెక్కడ?' మరణపు ముల్లు పాపము, పాపము నకున్న బలము ధర్మశాస్త్రమే. అయినను మన ప్రభువైన యేసుక్రీస్తు మూలముగా మనకు జయము అనుగ్రహిస్తున్న దేవునికి స్తోత్రము కలుగును గాక! ★

(సశేషం)



డా॥ యేలూరి ఆశీర్వాదం

# నిర్లక్ష్యపు నీడ

**మ**హోన్నతుని చాటున నివసించువాడే సర్వశక్తుని నీడను విశ్రమించువాడు. (కీర్తన 91:1)

మనము సర్వశక్తుని నీడలో ఉన్నామా? నిర్లక్ష్యపు నీడలో ఉన్నామా? మహోన్నతుని చాటున నివసిస్తే ఈ భయంకరమైన దినాలలో, అపాయకరమైన కాలంలో కాపుదల, భద్రత, నిర్భయం, ధన్యత. లేకుంటే నిర్లక్ష్యపు నీడలో ఉంటే బాధాకరం, ప్రమాదకరం, హానికరం, క్షమింపరాని నేరం. మనుష్యకుమారుని రాకడ దినములు నోవహు దినముల వలెను, లోతు దినముల వలెను ఉన్నాయి. జనాభా పెరిగింది, పాపం పెరిగింది, నిర్లక్ష్యం పెరిగింది. భక్తి-విశ్వాసములు తరిగాయి.

క్రైస్తవ సమాజం నిర్లక్ష్యపు నీడలో నున్నది. కాని క్రీస్తు అడుగు జాడలలో లేదు. (నడుచుట లేదు) నిర్లక్ష్యపు నీడలు – స్వనీతి, స్వేచ్ఛ అను క్రీడలు! క్రీస్తు కూడ మీ కొరకు బాధపడి మీరు తన అడుగు జాడలయందు నడుచుకొనునట్లు మీకు మాదిరి యుంచి పోయెను.' 1 పేతురు 2:21

అపొస్తలుడును, ప్రధానయాజకుడునైన యేసునందు లక్ష్యముంచుడి. అని వాక్యం చెబుతుంది. కాని మనకెంత నిర్లక్ష్యమో కదా. వాక్యానికి చెవియొగ్గుట లేదు. లక్ష్య పెట్టుట లేదు. ఉత్సాహ సభలు అంటే ఉజ్జీవం లేదనే కదా అనగా నిర్జీవంగా ఉన్నమాటే. వాక్యం విరివిగా వెదజల్లబడఉరితుంది. వినుటలో నిర్లక్ష్యం ఆచరణ శూన్యం. వాక్యం హృదయాలలోనికి చొచ్చుకు పోవడం లేదు. దేవుని వాక్యము సజీవమై బలము గలదై రెండంచులు గల యెటువంటి ఖడ్గము కంటెను వాడిగా ఉండి, ప్రాణాత్మలను, కీళ్ళను, మూలుగను, విభజించునంత మట్టుకు దూరుచు, హృదయము యొక్క తలంపులను, ఆలోచనలను శోధించుచున్నది. హెబ్రీ 4:12

భూజంతువుల కంటే మనకు ఎక్కువ బుద్ధి నేర్పుచు, ఆకాశ పక్షుల కంటే మనకు ఎక్కువ బుద్ధి నేర్పుచు, ఆకాశ పక్షులకంటే మనకు ఎక్కువ జ్ఞానము కలుగ జేయుచు నన్ను సృజించిన దేవుడు ఎక్కడ ఉన్నాడని అనుకొనువారెవరును లేరు. యోబు

ఎద్దు తల కామందు నెరుగును, గాడిద తన సొంతవాని దొడ్డి తెలిసికొనును. కాని ఇశ్రాయేలుకు తెలివిలేదు. యెషయా వారు తమ మనస్సులలో దేవునికి చోటియ్యనొల్లక పోయిరి (రోమా 1:28)

ఈ భక్తి, విశ్వాసాలు మనకు సరిపోవునా? చాలవు. ప్రియులారా "నేను క్రీస్తును పోలి నడుచుకొనుచున్న ప్రకారము మీరును నన్ను పోలి నడుచుకొనుడి! అంటున్నాడు అపొ.పౌలు. మనము అలా నడుస్తున్నామా? పౌలు వలె మనము కూడా చెప్ప గలిగితే ఎంతో



ధన్యులము. పౌలును మనవంటివాడే గదా. మనం ప్రయత్నించుటలేదు.

క్రీస్తు యేసునకు కలిగిన ఈ మనస్సు మీరును కలిగియుండుడి. ఆయన గుణగణములు, పోలికలను మనమును కలిగియుందాము. యేసుప్రభువు దేవుని ఇల్లంతటిలో నమ్మకమైనవాడు, సాత్వికుడు, దీనమనస్సు గలవాడు, తండ్రికి విధేయుడు, తన్నుతాను తగ్గించుకొన్నాడు. మనము ఆయన పిల్లలము, ఆయన మేపెడు గొర్రెలము, మనము ఆయన వారము. మనము క్రీస్తును, ఆయన ప్రేమను చూపించవలసి యున్నాము. మన పరలోకపు తండ్రివలె పరిపూర్ణులము కావాలి. క్రీస్తు సారూప్యము లోనికి ఎదగాలి. అదే పౌలునకు కలిగిన ప్రసవవేదన.

### నిర్లక్ష్యనికి మూల్యం

యెహోవా మీకు దొరుకు కాలమునందు ఆయనను వెదకుడి. ఆయన ఐమీపములో ఉండగా ఆయనను వెదుకొనుడి. (యెసయా 55:6) యెహోవా దొరుకు కాలము, సమీపము అను పదములు వాడుటలో దొరకని కాలము, దూరమగు కాలములు కూడా ఉందునని మనము గమనించవలెను. అవును అందుకే వాక్య క్షామము (కరువు) వస్తుందని ఆమోను 8:11-12 లో చూస్తున్నాము.

యిప్పుడు దేవుని వాక్యము విరివిగా వెదజల్లబడుతుంది. ఇదే నిర్లక్ష్యము. ఎప్పుడూ పరిస్థితులు ఇలానే ఉంటాయని భ్రమపడుతున్నావా? జపాన్ పరిస్థితి ఏమైంది?!

తమ కాలము ఎప్పుడు వచ్చునో నరులెరుగరు. చేపలు బాధకరమైన వలయందు చిక్కుబడునట్లు, పిట్టలు వలలో పట్టుబడునట్లు అశుభకాలమున హఠాత్తుగా తమకు చేటు కలుగునప్పుడు వారును చిక్కుబడతారు. ప్రసంగి

ఆకాశముల కెగురు సుకుబుడి కొంగయైనను తన కాలము నెరుగును. తెల్లగువ్వయు, మంగలకత్తి పిట్టయు, ఓదె కొరుకును తాము రావలసిన కాలమును ఎరుగును. అయితే నా ప్రజలు యెహోవా న్యాయవిధిని ఎరుగరు. యిర్మీయా

నిర్లక్ష్యానికి ఫలితాలు

### ఏశావు

ఒక పూట కూటి కొరకు తన జ్యేష్టత్వపు హక్కును అమ్మివేసిన ఏశావు వంటి భ్రష్టుడైనను, వ్యభిచారియైనను ఉండునేమో అనియు జాగ్రత్తగా చూచుకొనుడి. ఏశావు ఆ తరువాత ఆశార్వాదము పొందగోరి కన్నీళ్ళు విడుచుచు దాని కోసరము శ్రద్ధతో వెదికినా మారుమనస్సు పొందుటకు అవకాశము దొరకలేదు. విసర్జింపబడ్డాడు.

### షూలమ్మితి

ఈమె వధువు సంఘమునకు సాదృశ్యము. ప్రియుడు మన ప్రభువైన యేసు. ఆమె నిర్లక్ష్యము వలన ఏమి జరిగెనో మనకు తెలియును. ప్రియుడు తలుపు తీయుమని వాకిలి తట్టగా ఆమె తీయ నిర్లక్ష్యము చేసింది. ఆమె తలుపు తీయునంతలో ప్రియుడు వెళ్ళి పోయెను. ఆ తర్వాత వెదకినను కనబడలేదు. పిలిచినను అతడు పలుకలేదు. ఆమె నిర్లక్ష్యమువలన గాయపడింది.

### బుద్ధిలేని కన్యకలు


మత్తయి 25:1-13 పదిమంది కన్యకలు ఉపమానంలో బుద్ధిలేని కన్యకలు పెండ్రి కుమారుని ఎదుర్కొనలేక పోయారు. పెండ్లి విందులోనికి వెళ్ళలేకపోయారు. తలుపు వేయబడింది. ఇప్పుడు కూడా పెండ్లి కుమారుడు ఆలస్యము చేస్తున్నాడు. నూనె పరిశుద్ధాత్మక సాదృశ్యము. మనము యేసు రెండవ రాకడకై సిద్ధపడి ఉందాం.

### ధనవంతుడు

ధనవంతుడు - లాజరు కథలోని ధనవంతుని పరిస్థితి మనకు గొప్ప గుణపాఠము. తగిన కాలములో వెదకక నిర్లక్ష్యము చేయుట వలన అతడు వేదన, యాతనకరమైన స్థలము నకు వెళ్ళాడు. భూమి మీద బ్రతికి యున్నప్పుడే సిద్ధపడాలి తప్ప అక్కడికి వెళ్ళిన తర్వాత ప్రయోజనం లేదు. నిర్ణయం తీసుకొనే సమయం, స్థలం అదికానే కాదు.

### ముగింపు

నోవహు కాలములోని ప్రజలు నిర్లక్ష్యం చేసి జలప్రళయంలో చనిపోయారు. మనము ఏ విషయములోను నిర్లక్ష్యం చేయకూడదు. ప్రభువు రాక ముందే, నీ ప్రాణం పోకముందే, దుర్దినములు రాకముందే కృపాద్వారాలు మూయబడకముందే మనము నిత్యజీవము కొరకు సిద్ధపడాలి సుమా! రేపునకు రూపులేదు. నేడే రక్షణ దినము. త్వరగా వస్తున్న యేసు ద్వితీయాగమనమునకై సిద్ధపడుదముగాక ఆమేన్. దైవాశీస్సులు.



# బైబిల్‌లోని పేర్లు వాటి అర్థాలు

**ఇశ్రాయేలు** = దేవునితో పోరాడువాడు లేదా దేవునితో ఏలువాడు.
1) ఇస్సాకు కుమారుడైన యాకోబునకు దేవుడు పెట్టిన క్రొత్త పేరు. ఆది 30సార్లు...
2) యాకోబు సంతతివారు – ఇశ్రాయేలీయులు.
3) ఇశ్రాయేలు రాజైన సొలోమోను సామెతలు. సామె 1:1
4) రెహబాము ఏలుబడిలో ఇశ్రాయేలీయుల రాజ్యము రెండు భాగములైన విమ్మట దక్షిణ రాజ్యమునకు అనగా యూదా బెన్యామీనులు గోత్రరాజ్యమునకు యూదా అను పేరు, మిగిలిన పది గోత్రముల రాజ్యమునకు "ఇశ్రాయేలు" అను పేరు కలిగెను.

**ఇశ్శాఖారీయులు** = యాకోబు కుమారుడైన ఇశ్శాఖారు వంశస్థులు. సంఖ్యా 7:18; 10:15; 26:23; 34:26; యెహో 17:10,11; న్యాయా 5:15; 1దిన 12:32; యెహె 48:25,26

**ఇశ్శాఖారు** = కొనబడెను లేదా కూలి లేదా ప్రతిఫలము.
1) యాకోబు తొమ్మిదవ కుమారుడు. ఆది 30:18; 35:23
2) ఇశ్శాఖారు గోత్రికులు; ఇశ్శాఖారీయులు. సంఖ్యా 1:8,28,29
3) రాజైన దావీదు కాలమందు దేవుని మందిరమునకున్న ద్వారపాలకులలో ఒకడు.

**ఇష్బాకు** = అతడు వదలిపెట్టును. అబ్రాహాము కెతూరాల కుమారులలో ఒకడు. ఆది 25:2; 1 దిన 1:32

**ఇష్మాయేలు** = దేవుడాలకించువాడు.
1) అబ్రాహాము ఐగుప్తీయురాలైన హాగరునందు కనిన కుమారుడు. ఆది 16:11,15,16
2) రాజైన సౌలు కుటుంబికులలో ఒకడు. 1 దిన 8:38; 9:44
3) రాజైన యెహోషాఫాతు కాలమందలి యూదా గోత్రాధిపతియగు జెబద్యా తండ్రి. 2 దిన 19:11
4) రాజైన యోవాషు కాలమందలి ఒక శతాధిపతి. 2 దిన 23:1
5) ఎజ్రాకాలమందు అన్యస్త్రీలను పెండ్లి చేసికొనిన యాజకులలో ఒకడు. ఎజ్రా 10:22
6) యిర్మీయా కాలమందలి ఒక దుర్మార్గుడు. 2 రాజు 25:23,25; యిర్మీ 40:8,14,15.

**ఇష్వా** = సమానము లేదా సమము చేయును. ఆషేరు రెండవ కుమారుడు. ఆది 46:17; 1 దిన 7:30

**ఇష్బోషెతు** = సిగ్గుపడవలసినవాడు. అబ్నేరు చేత ఇశ్రాయేలీయులమీద రాజుగా నియమింపబడియు మంచము మీద చంపబడిన సౌలు కుమారుడు. 2 సమూ 2:8,10,12,15; 3:8,14

**ఇస్కరియోతు** = కెరియోతు అను గ్రామకాపురస్తుడు. ప్రభువైన యేసుక్రీస్తును శత్రువులకు అప్పగించిన యూదా. మత్త 10:4; 26:14 మార్కు 3:19; 14:10; లూకా 6:16; 22:3; యోహా 6:71; 13:26 (యోహాను 14:22 ఇస్కరియోతు కాని యూదా.)

**ఇస్సాకు** = అతడు నవ్వును. అబ్రాహాము భార్యయగు శారా వృద్ధాప్యమునందు కనిన కుమారుడు. ఆది. లో 76సార్లు..

**ఈకాబోదు** = మహిమపోయెను లేదా ప్రభావమెక్కడిది. యాజకుడైన ఏలి మనుమలలో ఒకడు. 1 సమూ 4:21; 14:3

**ఈకొనియ** = వచ్చువాడు లేదా విగ్రహమున పోలినది. ఆసియలో పౌలును, బర్నబాయును సువార్త ప్రకటించిన ఒక పట్టణము. అ.కార్య 13:51; 14:1,19

**ఈతామారు** = ఈతచెట్ల తీరము. ప్రధాన యాజకుడైన అహరోను కనిష్టపుత్రుడు. నిర్గ 6:23; 28:1

**ఈతీయేలు** = దేవుడు నాకు తోడైయున్నాడు.
1) బెన్యామీను వంశస్థులలో ఒకడు. నెహె 11:7
2) ఆగూరు దేవోక్తి పలికినవారిలో ఒకడు. సామె 30:1

**ఈయ్యె అబారీము** = అవతలి ప్రదేశములోని పాడుశేషము. ఐగుప్తు దేశమునుండి సీనాయికొండకు ఇశ్రాయేలీయులు చేసిన ప్రయాణ మందలి ఒక మకాము. సంఖ్యా 21:11; 33:44,45

**ఈరాదు** = కయీను మనుమలలో ఒకడు. ఆది 4:18

**ఈరూ** = మేలుకొనియుండుట, కావలి యుండుట. యెపున్నె కుమారుడైన కాలేబు పెద్దకుమారుడు. 1 దిన 4:15

**గమనిక** – ఈ వాక్య భాగాలు మీ బైబిలులో పెన్సిలుతో గుర్తించండి. అర్థాలు రాసుకోండి. వాక్యాన్ని మరింకా బాగా అర్థం చేసుకోవటానికి సాయపడతాయి.

కీ॥శే॥ దైవజనులు డా॥ యస్. జాన్‌డేవిడ్ అయ్యగారిచే స్థాపించబడిన
ఫార్ కార్నర్స్ ఇండియా ఇంటర్నేషనల్ నడుపుచున్న వేదాంత తర్ఫీదు కేంద్రము

Far Corners INDIA INTERNATIONAL

# వర్డ్ ఆఫ్ లైఫ్ ట్రైనింగ్ సెంటర్

మోటో: ఎంటర్ టు లర్న్ & లీవ్ టు సర్వ్

**దేవుని పిలుపు కలిగి వేదాంత విద్య చదవాలనే యువకులకు అమూల్య అవకాశం!**

**కోర్సు వివరము:**

సర్టిఫికెట్ ఆఫ్ థియాలజి 2 సం॥ (తెలుగు మీడియం) – 10వ తరగతి పాస్ లేదా ఏదేని డిగ్రి

**అర్హతలు:**

❖ పరిచర్యా భారం ❖ సేవా సమర్పణ ❖ నమ్మకత్వము ❖ విధేయత

**ప్రత్యేకతలు :**

- ❖ వేదాంత విద్యకు సహకరించే కోర్సులు
  (సంగీత వాయిద్యముల శిక్షణ (కీ బోర్డ్, గిటార్, డ్రమ్స్ / ప్యాడ్స్), డ్రైవింగ్, ఫస్ట్ ఎయిడ్ & హెూమ్ నర్సింగ్
- ❖ అన్ని వేళల్లో విద్యార్థులకు అందుబాటులో నున్న గ్రంథాలయం
  (తెలుగు మరియు ఇంగ్లీషు గ్రంథములు)
- ❖ దైవ వాక్య పరిజ్ఞానం గల అధ్యాపక బృందం
- ❖ యాంత్రిక బోధన విధానం కాక ఆచరణాత్మక తర్ఫీదు
- ❖ 19 ఎకరముల సువిశాల ప్రాంగణం

దరఖాస్తులు చేరవలసిన తేది
**ఆగష్టు 13, 2011**

క్లాసులు ప్రారంభం
**ఆగష్టు 22, 2011**

**ప్రత్యేక ఉచిత సదుపాయములు :**

- ❖ భోజన వసతి
- ❖ బట్టలు (రెగ్యులర్ వేర్, యూనిఫాం), స్టేషనరి, టాయ్‌లెటరీస్
- ❖ పాకెట్ మనీ

దరఖాస్తుల కొరకు సంప్రదించవలసిన చిరునామా

| | |
|---|---|
| ప్రిన్సిపల్<br>**వర్డ్ ఆఫ్ లైఫ్ ట్రైనింగ్ సెంటర్**<br>గ్రేస్ ఎన్‌క్లేవ్, కృపానగర్,<br>కావూరు పోస్ట్,<br>చిలకలూరిపేట - 522 611<br>మొబైల్ : 90309 74313 | గుడ్‌న్యూస్ మినిస్ట్రీస్<br>**ఫార్ కార్నర్స్ ఇండియా ఇంటర్నేషనల్**<br>డోర్ నెం. 31/163, గుండయ్యగారి తోట,<br>చిలకలూరిపేట - 522 616<br>ఫోన్. 08647 - 255495.<br>మొబైల్ : 98489 67569 |

❖ సీట్లు పరిమితం ❖ అడ్మిషన్లు జరుగుచున్నవి



– రెవ. హెన్రీ పెట్కర్

# అడిగారు కాబట్టి...

*(దైవజనులు రెవ. హెన్రీపాల్ పెట్కర్ గారు హైదరాబాద్ పరిసర ప్రాంతాలలో సుమారు 35 సం॥రాలు ఘనమైన సేవ జరిగించారు. ట్రాన్స్ వరల్డ్ రేడియో సేవను విశ్వవాణి నిర్వహించక ముందు రోజుల్లో 'దేవుడు మాట్లాడాడు' అనే పరిచర్యలు నిర్వహించేవి. ఈ పరిచర్యలకు ఆచార్య ఆరార్కే మూర్తి గారు ఛైర్మన్‌గా, రెవ. హెన్రీ పెట్కర్ గారు సెక్రటరీగా ఉండేవారు. ఈ దైవజనుని రచనలలోనుండి ఈ ప్రశ్నలు – జవాబులు మీకందించటం భాగ్యంగా భావిస్తున్నాము)*

**ప్రశ్న** – అమెరికా, కెనడా లాంటి దేశాలను క్రైస్తవ దేశాలు అని అంటారు నిజమేనా?

**జవాబు** – ప్రపంచంలో ఎక్కడా క్రైస్తవ దేశమంటూ లేదు కొన్ని దేశాల్లో క్రైస్తవులు ఎక్కువ వుండొచ్చు, మరి కొన్ని దేశాల్లో తక్కువ వుండొచ్చు, అంతే గాని క్రైస్తవ దేశమంటూ ఏదీలేదు.

**ప్రశ్న** – క్రైస్తవులలో ఇన్ని శాఖల వివిధ పేర్లతో ఎందుకున్నాయి?

**జవాబు** – పునరుద్ధరణ (రిఫార్మేషన్) జరిగిన 16వ శతాబ్దం వరకూ రెండు ముఖ్యమైన గుంపులు ఉండేవి. కథోలికులు, ఆర్థడాక్స్ క్రైస్తవులు. ఆనాటి కథోలిక సంఘం బైబిల్లో లేని కొన్ని సిద్ధాంతాలను ప్రవేశపెట్టింది. అవి వెనక్కు తీసుకోటానికి ఇష్టపడలేదు. దాని మూలకంగా నాలుగు డినామినేషన్లు ప్రారంభమయ్యాయి. లూథరన్, కాల్వినిస్ట్, జ్విగ్గియన్, అనాబాప్టిస్టు అని ఈ నాలుగు గ్రూపుల వారు వేరుగా సంఘాలు ప్రారంభించుకున్నారు. వారు ప్రొటెస్టు చేశారు కాబట్టి వారిని ప్రొటెస్టెంట్ సంఘాలు అన్నారు. ఈ నాలుగు గ్రూపులు కాలానుక్రమంలో అనేక గ్రూపులుగా డినామినేషన్లు ఏర్పడ్డాయి. కొంతమంది ఆరాధన తు. చ తప్పకుండా ఓ పద్ధతిలో ఉండాలని, మరికొందరు ఫరవాలేదు మరీ అంత నిక్కచ్చిగా ఉండాల్సిన అవసరం లేదు అంటారు. కొందరేమో అక్షరార్థమైన ఆరాధనలు కోరుకుంటారు, కొందరు ఆరాధన మరోలా ఉండాలని కోరుకుంటారు. లేఖనాలు విశదీకరించి చెప్పటంలో ఒక్కో డినామినేషన్ ఒక్కో సిద్ధాంతాన్ని తెచ్చి పెట్టుకున్నా, – ప్రభువైన యేసుక్రీస్తునందు విశ్వాసము ఉంచటం వలననే రక్షణ, పాపక్షమాపణ, అని ప్రతి ఒక్కరూ ఒప్పుకునే ఒక విషయం, అంచేత ఒకరిని ఒకరు ప్రేమించుకోటానికి, ఒకరిది మరొకరితో పంచుకోటానికి గాని ఎలాంటి సమస్యా ఉండదు, ఉండకూడదు. దైవజనులు డా॥ బిల్లీగ్రహం గారి సువార్త సభలను దాదాపు 100 వేరు, వేరు డినామినేషన్లు ఆర్థికంగాను, నైతికంగాను సహకరిస్తాయి.

**ప్రశ్న** – క్రైస్తవం మతం కాదు, అని కొందరంటున్నారు, అది కరెక్టేనా?

**జవాబు** – అవును, వాస్తవానికి నొక్కి చెప్పాలంటే క్రైస్తవం మతం కాదు. అన్ని పేరున్న మతాలు కొన్ని నియమాలను పాటించటం, నెరవేర్చటం చుట్టూ అల్లుకుని ఉంటాయి. కొందరికేమో ఆ విషయాలు చాలా పెద్దవిగా ఉంటాయి, కొందరికి చిన్నవిగా ఉంటాయి. వారి నియమాలు చాలమట్టుకు మంచివే. అయితే మతం మంచిని చేయటానికి గాని చెడును మానటానికి గాని ఎలాంటి శక్తిని ఇవ్వలేదు. వారి నియమాలను నిష్టగా పాటించటం వలన దేవని దయకు పాత్రులమవుతామని, దేవుడు తమను అంగీకరిస్తాడని అనుకుంటారు. క్రైస్తవం క్రీస్తు అనే వ్యక్తి చుట్టూ తిరుగుతుంటుంది. ఇందులో ప్రాముఖ్యమైన ప్రభువైన యేసుతో మనకున్న వ్యక్తిగత సంబంధము. మనము ఏమి చేశామో అనే దానిని బట్టి దేవుడు మనల్ని అంగీకరించటం కాదు మనకోసం యేసయ్య ఏంచేశాడు అనేదానిని బట్టి దేవుడు మనల్ని అంగీకరిస్తున్నాడు. క్రైస్తవ జీవితం, మన పాపాలను యేసయ్య క్షమిస్తాడని, శాశ్వత నిత్యజీవాన్ని మనకిస్తాడని ఆయనయందు విశ్వాసముంచటం. పాపము మానవుణ్ని దేవుణ్ని వేరు చేస్తుంది. అయితే అనేక మతాలు మానవుడు జన్మపాపి అని కనీసం ఒప్పుకోరు అంతే కాదు పాప పరిహారానికి వారి మతాలలో ఎలాంటి సిద్ధపాటు లేదు.

(9వ పేజి తరువాయి)

**5. చింతలు, అనుమానాలు:** చీటిమాటికి చింతించే వాళ్ళు, అనుమానాలు ఎక్కువగా వుండేవాళ్ళు, ప్రతిదానికి ఇతరుల మీద ఆధారపడేవారు, వీరికి ప్రతిదానికి భీతి చెందే స్వభావం వచ్చేస్తుంది. ప్రతిదానికి భయపడే స్వభావం గలవారికి ఈ భయం కలిగినపుడు **'ఎడ్రినల్'** గ్రంధి నుంచి హార్మోన్లు స్రవిస్తాయి. యిలా స్రవించి అధిక రక్తపీడనం, గుండెపోటు, అల్సర్ వంటి వ్యాధులకు దారితీస్తాయి.


నీలో భయం కలగడానికి కారణాలు వెతుకు. దేవుని వాగ్ధానాలతో వాటిపై దాడి చేస్తే భయం పారిపోతుంది. ధైర్యం కలిగి వుండాలి. దేవుడు మనకు తోడై వున్నాడనే ధైర్యంతో సైతాను బలాన్ని త్రిప్పికొట్టవచ్చు. ఉదా: గొల్యాతుపై దావీదు జయం.


సువార్త ప్రకటించడానికి ఎన్నో అడ్డులు, ఆటంకాలున్నా, యాజకులకు, సద్దూకయ్యలకు భయపడక క్రీస్తును గూర్చి ధైర్యంగా, బాహాటంగా పేతురు యోహానులు ప్రకటించడం చూచి వారు ఆశ్చర్యపడ్డారు. అ.కార్య 3:6

కీర్తనాకారుడైన దావీదు **"దేవుడు మన ఆశ్రయమును, దుర్గమునై యున్నాడు. ఆపత్కాలములో ఆయన నమ్ముకొనదగిన సహాయకుడు. కావున భూమి మార్పునొందినా, నడి సముద్రాల్లో పర్వతాలు మునిగినా, వాటి జలాలు ఘోషిస్తూ నురుగు కట్టినా ఆ పొంగుకు పర్వతాలు కదిలినా మనం భయపడం."** కీర్తన 46:1-3

యెహోషువాకు సెలవిచ్చిన దేవుడు మనతో కూడా అంటున్నాడు **"నిన్ను విడువను, నిన్ను ఎన్నడు ఎడబాయను. నిబ్బరం కలిగి ధైర్యంగా వుండుము. దిగులుపడకు! జడియకు! నీవు నడచు మార్గమంతటిలో నీ దేవుడైన యెహోవా నీకు తోడై యున్నాడు."** యెహోషువా 1:7-9. **భయానికి బై బై చెబుదాం! జయం మనదే, అందాం!** దేవునికి స్తోత్రాలు!.

## దేవుని బహుమానములు





మన స్పందన పత్రిక సంపాదకులు డా॥ దేవ గారు, శ్రీమతి కృప గార్లను దేవుడు దీవించి ఇచ్చిన బహుమానం ఇద్దరు పిల్లలు, కుమారుడు జోయల్, కుమార్తె ఏంజెల్. బిడ్డలిద్దరూ బాప్తిసంలో సాక్ష్యమిచ్చి దేవుణ్ని మహిమ పరచారు. తాత గారు దైవజనులు అబ్రాహాం దండల గారి ద్వారా బాప్తీసాలు తీసుకోవటం, మరో తాత పరమానందంగారి ప్రార్ధనలు అందుకోవటం బిడ్డలకు దేవుడు చూపిన కృప, భాగ్యము. యవ్వన బిడ్డలిద్దరి ఆధ్యాత్మిక జీవిత క్షేమం కోసం, ఆత్మీయాభివృద్ధికోసం ప్రార్ధించాలని మనవి.

జోయల్ తన బి. టెక్, పై చదువుల కోసం సిద్ధ పడుతున్నాడు. ఏంజెల్ యంసెట్ రిజల్ట్స్ వచ్చి మెడిసిన్ సీటుకోసం ఎదురుచూస్తోంది. జులై 13 నుండి జరిగే కౌన్సిలింగ్ దేవుని చిత్త ప్రకారం మంచి కాలేజీలో సీటు వచ్చేట్టు పాఠకులు ప్రార్ధించాలని మనవి. వారి జీవితాలలో దేవుని పిలుపు వుంటే సంపూర్ణ సేవకు సమర్పించుకోవాలని లేదా జీవితాల్లో సేవకు ప్రధమ స్థానము ఉండాలని, పేదలు- అనాధలయిన విధ్యార్ధులకు, వృద్ధ-పేద విధవ రాండ్రకు సాయపడాలని తల్లిదండ్రులు ఆశిస్తూ వారికి నేర్పిస్తుంటారు. ప్రార్ధింప మనవి.



# క్లుప్త ప్రసంగాలు

## నడచుకొనుడి

1.క్రీస్తును పోలి...కొరింథీ 11:1
2. జ్ఞానము కలిగి..కొలస్సీ 4:5
3. దేవునికి తగినట్లు..1 థెస్స 2:11,12
4. మేలైన దానిని అనుసరించి..1 థెస్స 5:15
5. క్రమముగా ... ఫిలిప్పీ 3:16
6. ఆత్మానుసారముగా...గలతీ 6:16
7. ఆయన ఆజ్ఞల ప్రకారం.. 2 యోహాను 1:6

## జాగ్రత్తగా చూచుకొనుడి

1. కృపను పొందకుండ తప్పిపోవునేమో.. హెబ్రీ 12:15
2. నిలుచున్నానని తలంచుకొనువాడు. 1 కొరింథీ 10:12
3. పూర్ణఫలము పొందునట్లు..2 యోహాను 1:8
4. దేవుని విడిచే దుష్ట హృదయము నుండి హెబ్రీ 3:12
5. సమయం పోకుండ.. ఎఫెసీ 5:15,16
6. తాను ఏలాగు కట్టుచున్నాడో..1 కొరింథీ 3:10
7. మీరేమి వినుచున్నారో... మార్కు 4:24

## ప్రభువను భరించినవి

1.పశువుల తొట్టె. లూకా2:7
2. దోనె. లూకా 8:23
3. గాడిద. లూకా 19:35
4. సిలువ శ్రమ. అ.కార్య 5:30
5. రాతి సమాధి. లూకా 23:53
6. ఒలీవల కొండ. యోహాను 7:53; 8:1; లూకా 9:58
7. మగ్ధలేనే మరియ. యోహాను 20:15

## నీతిమంతుడు

1. అతని ప్రార్థన ఆలకించును. సామె 15:29
2. అతని వెలుగు తేజరిల్లును. సామె 13:9; 4:18
3. అతని వేరు చిగుర్చును. సామె 12:12; కీర్తన 92:12
4. ఎన్నడనూ కదలించపబడడు. సామె 10:30
5. అతని ఇల్లు నిలుచును. సామె 12:7
6. చిగురాకువలె వృద్ధినొందును. సామె 11:28; కీర్తన 92:15
7. నిత్యము నిలుచు కట్టడము. సామె 10:25

## నేర్చుకొనుడి

1. నా కాడి ఎత్తుకొని నాయొద్ద.. మత్తయి 11:28
2. శక్తిగల పరిశుద్ధ లేఖనాలు.. 2 తిమోతి 3:14,15
3. సత్క్రియలు. తీతు 3:14
4. దేవుని మర్యాద. 2 రాజు 17:27
5. ఆయన వాక్య భావమేమిటో...మత్తయి 9:13
6. మేలు చేయుట నేర్చుకొనుడి. యెషయా 1:17
7. ఆయన కట్టడలను అనుసరించి నడుచుకొనుట. ప్రసంగి 12:13

## అభివృద్ధి చెందుడి

1. దేవుని విషయమైన జ్ఞానమందు.. కొలస్సీ 1:9,12
2. ఆయ ప్రేమలో.. ఫిలిప్పీ 1:9, 1 థెస్స 3:12,13
3. విశ్వాసములో... 2 థెస్స 1:3
4. నీతి ఫలములలో.. 2 కొరింథీ 9:10
5. మాటలలో.. ఎఫెసీ 4:27,28,29
6. ఒకనికొకడు క్షేమాభివృద్ధి కలుగుజేయుడి. 1థెస్స 5:11; ఫిలిప్పీ 2:4
7. ప్రతి విషయములో.. 2 కొరింథీ 8:7

## మెదడుకు మేత

# ఐగుప్తు చేరిన లేయా జిల్పా కుమారులు 49

కూర్పు - పాస్టర్ పి.ప్రతాప్ కుమార్

| | | | | | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| పె | ప్యో | లు | బె | జె | గా | రు | బె | హె | షే | రీ | గె | ఆ | లి |
| లు | ను | రూ | లే | ను | బూ | అ | రు | లో | ను | ఏ | హ | ర్షో | క |
| ను | యే | లో | ర్షో | హ | మ | లూ | యే | ఖా | ల్కీ | మీ | బె | మ్నా | ను |
| రి | ఇ | ల్కీ | ఏ | దీ | య | ల్లు | ను | ఓ | శ్శా | హ | యా | రీ | దు |
| తు | రా | ష్వా | మ | గ్గీ | ప | యె | మ | హు | గా | ఇ | లు | ఆ | యా |
| నా | హో | మె | షి | ఓ | మూ | సో | ర | పె | యో | షా | షూ | మూ | హె |
| మె | దీ | క | ర్మీ | యే | రా | జె | రె | బు | వూ | లా | యా | స్రో | హో |
| బు | బు | హో | లు | దు | మూ | సు | హ | లు | హు | షే | ను | కీ | లే |
| హ | తు | కో | హె | ను | హ | ను | ర్మీ | దీ | క | ర | రు | వి | ను |
| ఇ | నో | లే | యా | షి | బే | ఓ | స్బో | వి | రో | మ్నా | శె | షే | లీ |
| ష్వీ | ను | కు | యా | హ | మ్రో | రూ | బె | ఎ | ఇ | ఆ | మె | రే | ఆ |
| దు | యె | స్రో | గ్గీ | ను | మూ | ను | ను | ఖా | యూ | ఇ | అ | షూ | రు |
| గా | రె | హ | హె | ఏ | మ్యో | లో | పు | ప్యో | ర | దా | జె | హ | నీ |
| షా | లు | సె | లా | తో | యో | షి | వ్వా | బు | సి | దా | సో | ము | గా |

1. యాకోబు
2. రూబేను
3. హనోకు
4. పల్లు
5. హెస్రోను
6. కర్మీ
7. షిమ్యోను
8. యెమూయేలు
9. యామీను
10. ఓహదు
11. యాకీను
12. సోహరు
13. షావూలు
14. లేవి
15. గెర్షోను
16. కహాతు
17. మెరారి
18. యూదా
19. పెరెసు
20. జెరహు
21. హెస్రోను
22. హామూలు
23. ఇశ్శాఖారు
24. తోలా
25. పువ్వా
26. యోబు
27. షిమ్రోను
28. జెబూలూను
29. సెరెదు
30. ఏలోను
31. యహలేలు
32. దీనా
33. గాదు
34. సిప్యోను
35. హగ్గీ
36. షునీ
37. ఎస్బోను
38. ఏరీ
39. ఆరోదీ
40. అరేలీ
41. ఆషేరు
42. ఇమ్నా
43. ఇష్వా
44. బెరీయా
45. శెరహు
46. హెబెరు
47. మల్కీయేలు
48. షేలా
49. ఇష్వీ

**సూచనలు:**

1. స్పందనలో ప్రింట్ చేసిన గ.ను.క. లోనే పంపాలి. వేరుగా పంపినవి స్వీకరింపబడవు.

2. పూర్తిచేసిన గ.ను.క. లు <u>వచ్చేనెల (ఆగష్టు15లోపు)</u> మాకందేటట్లు పంపాలి. ఇతర రాష్ట్రాల్లోని పాఠకుల సౌకర్యార్థం ఈ మార్పు చేశాము. గమనించగలరు.

పూర్తి చేసి పంపిన వారి పేరు.......................

ఊరి పేరు ..........................................

స్పందన కోడ్ నంబరు ..............................

## జులై గళ్ళ నుడి కట్టు

| | | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | | | ✝ | 2 | 3 | ✝ | 4 | | 5 |
| | ✝ | ✝ | 6 | ✝ | | ✝ | | ✝ | |
| ✝ | 7 | | | ✝ | 8 | | | ✝ | ✝ |
| 9 | | ✝ | 10 | | | ✝ | ✝ | 11 | 12 |
| ✝ | | ✝ | | ✝ | ✝ | 13 | | | |
| 14 | ✝ | 15 | ✝ | ✝ | 16 | | | ✝ | |
| | ✝ | | ✝ | 17 | ✝ | | ✝ | 18 | ✝ |
| | ✝ | 19 | | | | ✝ | 20 | | |
| ✝ | 21 | | | | ✝ | 22 | ✝ | | ✝ |
| 23 | | ✝ | ✝ | ✝ | ✝ | 24 | | ✝ | ✝ |

## అడ్డం

1. పరలోక పట్టణము అలంకరించబడిన రత్నములలో రెండవ రత్నము – – – (ప్రకటన)
2. సోదరి (తలక్రిందులు)
3. యెహోవా చేసిన – – – లు వచ్చి చూడుడి. (కీర్తన)
7. ఆయన ......సత్క్రియను ఒపికగా చుయుచు మహిమను, – – – ను అక్షయతను, వెదుకువారికి నిత్యజీవమిచ్చును. (రోమా)
8. కాను పెట్టెలో వేసేది. – – –
9. కన్నీళ్ళు విడుచుచు విత్తువారు .... సంతోషగానము చేయుచు – – లు మోసికొని వచ్చెదరు.
10. రాజకుమారుడు ఇచ్చిన మీనాను చెడ్డదాసుడు – – – న కట్టి ఉంచాడు.
13. నీతి – – – – గలవారై మేల్కొని పాపము చేయకుడి. (కొరింథీయులతో పౌలు)
16. యెహోవా నీ గుడారములో – – – గా ఉండదగిన వాడెవడు. (కీర్తన)
19. శరీర కార్యములలో ఏడవది. (గలతీ)
20. పిలాతు యేసును – – – లతో కొట్టించి సిలువ వేయనప్పగించెను.
21. యేసు నేనే మార్గమును, సత్యమును, – – – – (తలక్రిందులు)
23. యెహోవాకు కోపము పుట్టించిన ఇశ్రాయేలీయులు అరణ్యములో – – పోయారు.
24. ఈ మాటకు బోధకుడని అర్థము. – –

## నిలువు

1. – – ను జరిగించు ప్రతివాడును నీతిమంతుడు.
3. మానవునికి – – – – మొదలుకొని తలవరకు కొంచెమైనను స్వస్థత లేదు.
4. నీకు దృష్టి కలుగునట్లు నీ కన్నులకు – – – ను నా యొద్ద కొనుమని నీకు బుద్ధి చెప్పుచున్నాను. (లవొదికయ సంఘానికి దేవుడు)
5. 'యూదావారు తీగె – – నకు పెట్టుచూ మరి ఎక్కువగా నాకు కోపము పుట్టించుచున్నారు.' యెహోవా (యెహెజ్కేలు)
6. మన – – – – దేవుడైన యెహోవాకు స్తోత్రము కలుగును గాక!
7. మనుష్యులలో – – – గా ఎంచబడునది దేవుని దృష్టికి అసహ్యము.
11. మరియ సోదరి – –
12. యేసేపు పనకు తన అన్నల – – – సాష్టాంగ నమస్కారము చేసెను. (యేసేపు కల)
13. సత్యమందు వారిని – – – చేయుము. నీ వాక్యమే సత్యము. (తండ్రితో యేసు)
14. బైబిల్లో ఇండియాను గూర్చి ప్రస్తావించబడిన గ్రంథము. – – –
15. నీతిని, భక్తిని, విశ్వాసమును, ప్రేమను, ఓర్పును, – – – – ను సంపాదించుకొనుటకు ప్రయాసపడుము.
17. ప్రవక్తయైన ఎలీషా యొక్క సేవకుడు. – – –
18. చిన్నబిడ్డలను నా – – – చేర్చుకొనువాడుక నన్ను చేర్చుకొనును. (యేసు)
21. – – వెచ్చని జీవితము పాపము.
22. యేసుప్రభువు చనిపోయినప్పుడు దేవాలయపు – – నడిమికి చినిగెను.



# ప్రార్థన వేదిక



1. **పి.మేరీ – మదనపల్లి**
   (మేరీకి) కడుపులో క్రొవ్వుగడ్డలు కరుగుట కోసం
2. **ఆర్.సరోజిని – రాజోలు**
   బిడ్డలకు మంచి ఉద్యోగం కోసం
3. **కె.ఆనంద్ప్రేమరాజ్ – హైదరాబాదు**
   ఐజక్ లెఫ్ట్హాండ్ ఫ్రాక్చర్ త్వరగా రికవరీ కోసం
4. **డి.రాజశేఖర్ – విశాఖపట్నం**
   తండ్రి ఆరోగ్యం, పిల్లల చదువుల కోసం
5. **బి.జీవరత్నం – శ్రీకాకుళం**
   ముగ్గురు పిల్లలకు ఉద్యోగాలు, వివాహాలు కోసం
6. **వి.సాంబశివరావు – నందివాడ**
   కుటుంబ ఆర్థిక ఇబ్బందులనుండి విడుదల కోసం
7. **యన్.సత్యనారాయణ – విశాఖపట్నం**
   చిన్నకుమారుని చదువు, ఉద్యోగం కోసం
8. **డి.సత్యం – నంద్యాల**
   తమ్ముళ్ళ ఇంటర్మీడియెట్ సంప్లిమెంటరీ కోసం
9. **పి.మేరీ – నరసరావు పేట**
   పాపకి థైరాయిడ్ నుండి స్వస్థత కోసం
10. **బి.డేవిడ్ – వెలుగోడు**
    కిరణ్, సుచరితలకు గర్భఫలం కోసం
11. **ఎ.యస్.పి.రావు – సికింద్రబాదు**
    కుమార్తె వివాహం, కుమారిని భవిష్యత్తు కోసం
12. **కె.రూతు – చీరాల**
    (రూతు)కాలునొప్పి స్వస్థత, కుమార్తె వివాహం కోసం
13. **కె.క్రిష్టోఫర్ – కొత్తగూడెం**
    కుమార్తె చదువు, సంస్థ బాగా నడుచుట కోసం
14. **కె.దయాకర్ – విజయవాడ**
    కుటుంబంలో ఉన్న శోధనల నుండి విడుదల కోసం
15. **జి.డేవిడ్రాజు – అనంతపల్లి**
    కుటుంబంలో ఉన్న కష్టాలనుండి విడుదల కోసం
16. **జె.సరోజిని – రాజమండ్రి**
    మంచి ఆరోగ్యం (హార్ట్ అపరేషన్ జరిగింది) కోసం
17. **బి.డేవిడ్ – అనంతపూర్**
    కుమారిని ఆరోగ్యం, ఇంట్లో పరిస్థితి మెరుగు కోసం
18. **యస్.యఫ్.త్యాగరాజ్ – అదిలాబాద్**
    ప్రేమ్రాజ్, బానులకు సంతానం కోసం
19. **శారా అబ్రాహం – కాకినాడ**
    (శారా)జాయింట్ పెయిన్స్ నుండి స్వస్థత కోసం
20. **పి.సమాధానం – సత్తెనపల్లి**
    (సమాధానం) వివాహం, ఉద్యోగం కోసం
21. **పి.పార్వతి – విశాఖపట్నం**
    (పార్వతి) కిడ్నిలో రాళ్ళు, థైరాయిడ్ నుండి స్వస్థత కోసం
22. **జార్జ్ బెన్ని – హిందూపూర్**
    బెన్ని బలహీనత, మేరీప్రమీల బలహీనత నుండి స్వస్థత కోసం
23. **పి.రఘురామయ్య – కర్నూలు**
    సరోజమ్మ కాలు ఫ్యాక్చర్ నుండి స్వస్థత కోసం
24. **కె.ఐసయ్య, తెనాలి.**
    మానసిక సంబంధమైన మంచి ఆరోగ్యం కోసం,

ప్రత్యేక ప్రార్థనా మనవి – స్పందన సేవలో ఎంతగానో సహకరించే తమ్ముడు ప్రకాశం జిల్లా ఇనమనమెళ్లూరులో దైవసేవకుడు జాన్ తనకుటుంబం, సేవ కోసం ప్రార్థించాలని మనవి. దేవుడు సేవను ఎంతగానో అభివృద్ధి చెందించాడు. ఓ చక్కని ప్రార్థనా మందిరాన్ని కూడా స్థానిక విశ్వాసులందరూ కలసి నిర్మించుకున్నారు. తమ్ముడు జాన్ భార్య దైవసేవకురాలు బ్యూలాకు ఈ మధ్యన ఆరోగ్యం బాగోటం లేదు. చిన్న వయసులో వెన్నెముక, గర్భసంచి, కిడ్నీలో రాళ్ల వంటి సమస్యలకు చాలా బాధపడుతోంది. ఇది శత్రువైన అపవాది కార్యమని గమనిస్తు విశ్వాసముతో శత్రువు కార్యాలను ప్రభువైన యేసయ్య నామంలో బంధిస్తున్నాము.ఆమెన్! దీన సేవిక కోసం మీరూ ప్రార్థించాలని మనవి.



# బాల్యం నుండే భక్తిని అలవరచిన అమ్మ 'మా అమ్మ'

మా అమ్మ శారా దండల ప్రభువు మహిమలోనికి పిలువబడి అప్పుడే ఓ సం॥ అయిపోయింది. గత సం॥ జులై 2 న తాను కోరుకున్నట్టుగా దేవుని మందిరంలో, నాన్న గారి చేతుల మీదగా దేవుని సన్నిధికి చేరింది.

మా ఇంటి పెరట్లో కాచిన మొదటి కాయ గాని, మొదటి పండు గాని, గేదె ఇచ్చిన మొదటి పాలు, కోడి పెట్టిన మొదటి గుడ్డులాంటి చిన్న, చిన్న విషయాల దగ్గర నుండి జీవితంలో ప్రతి మొదటి విషయాన్ని దేవునికి సమర్పించాలని, దేవునికి మొదటి స్థానమివ్వాలని ఉగ్గుపాలతో మాకు నేర్పిన తల్లి.అవసరతగలవారిని ఆదుకోవాలని ఆటపాటల్లోనే నేర్పినఅమ్మ!

ఎంత కష్టాన్నయినా దేవునితో చెప్పుకొనేదే కాని ఏడుగురు కొడుకుల్లో ఎవ్వరికీ చెప్పుకునేది కాదు. దేవుని మీదే ఆధార పడిన ఆదర్శ విశ్వాసి, మా అమ్మ! వైద్యం అంటే అమ్మకు అస్సలు గిట్టదు. ప్రతి రోజు ఇన్సులిన్ వేసుకోటానికి, మూడు పూట్లా టేబ్లెట్లు వేసుకోవాలంటే చేదు మింగినంతగా బాధపడేది. 'ఈ జీవితం ఇక చాలు ప్రభువా!' అంటూ ఏ బాధ,చింత లేని ప్రభువు సన్నిధికి అమ్మ వెళ్లిపోయి అప్పుడే సం॥అయింది.

ఈ సంధర్భంగా లిటిల్ ఏంజల్ హోంలోని అనాధలు, పేదలయిన పిల్లలకు నూతన వస్త్రాలు, కొందరు పేద-వృద్ద వితంతువులకు చీరెలు పంపిణీ చేయాలని ఆశిస్తున్నాను. మా పాఠకులు నాతో కలసి ప్రార్దించాలని మనవి.

ఎనిమిది మంది పిల్లల్లో అందరికంటే చిన్న కుమారుడు ఐజక్‌కు, చివరి ఒకే కుమార్తె హెబ్సీబా వివాహాలు కోసం ప్రార్దించాలని మనవి.

నాన్న గారు దైవసేవకులు అబ్రాహాం దండల గారు ప్రకాశం జిల్లా, సంతనూతలపాడులో గత 40 సం॥రాలుగా దైవజనులు భక్తసింగ్ గారు, యోహాను గారి ద్వారా ప్రారంభించబడిన మోరియా ప్రార్ధనా మందిరంలో సేవ చేస్తున్నారు. వయో వృద్దాప్యంలో ప్రభువే తన చేయి పట్టుకుని నడిపిస్తున్నారు. జీవితంలోని ప్రతి విషయంలో ప్రభువును మహిమ పరచాలనే పౌరుషం కలిగిన దేవుని సేవకుడు మా నాన్న.

నాన్న పరిచర్య కోసం కుటుంబం కోసం పాఠకులు ప్రార్దించాలని మనవి.

-మీ ఎడిటర్



16 జూన్ 2010న 50 సం॥రాల పెళ్లిరోజు స్తుతి కూటంలో అమ్మ, నాన్న



మనుమలు,మనుమరాళ్ళు తాతయ్య, నానమ్మలతో



50 వసంతాల అన్యోన్య దాంపత్య జీవితం అమ్మ, నాన్నలది



అమ్మ నాన్నలతో చిన్న తమ్ముడు ఐజక్
ఒక్కతే కుమార్తె ఏడుగురు అన్నల చెల్లి - హెబ్సీ



అమ్మ నాన్నలతో పెద్దకుమారుడు, కోడలు దేవ, కృప

# గుంటూరు జిల్లా భట్టిప్రోలులో శాంతి, సువార్త మహాసభల ఫోటోలు


ఆత్మావేశంతో ప్రసంగిస్తున్న డా॥దేవ


రక్షణ పిలుపుకు స్పందించిన ప్రజలు


ప్రజలకోసం ప్రార్థిస్తూ డా॥దేవ


ప్రభుదాస్‌గారు, పద్మ, సురేంద్ర గార్ల స్తుతి ఆరాధన


స్వస్థత ప్రార్థనలు



డా॥దేవ దంపతులతో సోదరులు సునిల్ కుటుంబసభ్యులు, స్నేహితులు

## కనుమూరి సన్నీ, సంధ్యల వివాహం ఫోటోలు


వివాహ ప్రమాణాలు


పా॥ప్రకాశం గారి ప్రార్థన


వివాహ సర్టిఫికెట్‌ను అందచేస్తున్న డా॥దేవ




వధూవరుల కోసం దైవజనుల ప్రార్థనలు


శ్యాంబాబుగారు, డా॥దేవ, నవదంపతులు సన్నీ, సంధ్యగార్లు

RNI No: 32106/76 Regd No. VJ/057/2009-11
Licenced to post without pre-payment No. PMG/VJ/PWPP/21/2009-11

# స్పందన టి.వి.కార్యక్రమాలు

- వీనుల విందైన సంగీతం
- ఆశీర్వాదం కలిగించే ఆత్మపూర్ణ సందేశాలు
- మీ కోసం ప్రత్యేక ప్రార్థనలు
- 'అడిగారు కాబట్టి' మీ ప్రశ్నలకు జవాబులు
- వార్తలు-వాఖ్యలు 'మారిన జీవితాలు' సజీవ సాక్ష్యాలు




ప్రార్థించండి!
సహకరించండి!!

దైవజనులు ప్రసంగించి మీ కోసం ప్రార్థిస్తారు.

స్పందన, పోస్ట్ బాక్స్ 815, గుణదల, విజయవాడ - 520 004

# లిటిల్ ఏంజల్స్ హోమ్

అనాధ, పేద పిల్లలకు ఆశ్రయము



- శ్రేష్టమైన ఈ చిన్నబిడ్డల పరిచర్య కోసం ప్రార్థించండి
- ప్రభువు మీకు భారమిస్తే ఒక బిడ్డకు అయ్యే ఖర్చును మీరు ప్రతినెల పంపవచ్చును



చిన్న పిల్లలను ఆటంకపరచవద్దు. దేవుని రాజ్యము ఇలాటి వారిదే (బైబిలు)

వివరాలకు:
డా॥దేవ
లిటిల్ ఏంజల్స్ హోమ్

గమనిక: చెక్కులు, డ్రాఫ్టులు పంపించేవారు SPANDANA పేరు మీద పంపించ మనవి

స్పందన, పోస్ట్‌బాక్స్ 815, గుణదల, విజయవాడ - 520004